మెక్కడాచూడలేదు. (అని లేచి వెళ్ళి విస్సప్ప పాత్రుని కౌఁగిలించుకొని) ఓగాయకశిఖామణీ! నారద తుంబురాదులు నీకాలిగోరును పోలరు. ఇదికూడాపుచ్చుకో. (అని తనవ్రేలి వజ్రపుటుంగరమును దీసి యాతని వ్రేలికిఁ దొడుగుచున్నాఁడు.)

విస్స—వద్దు. అది నావేలికిపట్టదు. వద్దు. బిగువు.

గాన—ఇది వజ్రంవేసిన వుంగరం. చాలాఖరీదు చేస్తుంది.

విస్స—అలాగా? మరిచిపోయినాను. అలాగయితే యీవుంగరం నావేలికినదులు. సరిగా సరిపోతుంది.

గాన—(ఉత్సాహముతో) నాపేరు గానప్రియుడు. నేను లక్షరూపాయల కధికారిని. నాకు వకచక్కని కూతురువున్నది. మీరు యిక్కడవుండి యీవార్ధకదశలో నిత్యమూ మీసంగీతంతో నాచెవులకు విందుచేస్తూవుండడానికి వప్పుకొన్నట్టయితే నాకూతురుని మీకిచ్చి వివాహం చేస్తాను.

విస్స—నాకు—మహారాజుగారుకూడా తనకూతురిని యిస్తారు.

గాన—వేళాకోళంకాదు. నేను నిజంగానే చెపుతూవున్నాను. మీకు ధర్మపత్ని కావడమంటే నాకొమార్తెకుకూడా పరమసంతోషంగానే వుంటుంది.

[అప్పుడు లీలావతి ప్రవేశించుచున్నది.]

లీలా—(తనలో) మానాన్నగారు యిప్పుడేమిటీ అంటూవున్నారు? విశ్వపతి శాస్త్రికి నన్నిచ్చి వివాహం చెయ్యడమా?

గాన—అదుగో నాకూతురు. నాఆజ్ఞ చెల్లించడానికి సరిగ్గా సమయానికి వచ్చింది.

విస్స—ఓ యీశ్వరుడా! యింత చక్కనిదాన్ని నేను మెక్కడాచూడలేదు.

గాన—ఒక్క సౌందర్యముమాత్రమేకాదు. దీనికి నమ్రతా గుణసంపత్తీ విద్యాసమస్తమూవున్నవి.

లీలా—నాన్నగారూ! నాప్రార్థన వినండి.

గాన—మాటాడబోకు. ఇటువంటి గాయకచక్రవర్తికి ధర్మపత్నిని కాగలిగిన నీభాగ్యానికి సంతోషించు.

లీలా—మిమ్మలిని బతిమాలుకుంటాను. వక్కమాట వినండి.

గాన—వక్కమాటవినను. అరమాటవినను. నేను యేదైనా మాట అంటే ఆ మాట తక్షణం జరిగితీరవలెను.

విస్స—నన్ను యీామెతో వక్కమాటు మాట్లాడనియ్యండి. (రహస్యముగా గానప్రియునితో) మీారు భయపడకండి. నేను వక్కరాగంతీసి యీాచిన్నదాన్ని నావలలో పడవేస్తాను.

గాన—అలాచెయ్యండి. (తనలో) ఇతని పాటఅంటే మృగాలూ పక్షులూ కూడా సంతోషిస్తవి. మనుష్యుల మనస్సులు కరగడాని కాశ్చర్యం యేమి వుంటుంది?

విస్స—అమ్మా! నేను మహాపాటకుణ్ణని మీాతండ్రిగారు చేసే స్తోత్రాలకు నేను తగను. అయినాకానీ నాపాటవక్కసారి వినండి. (అని వికారముగా తలత్రిప్పుచు చేతులాడించుచు పాడుచున్నాఁడు.)

ఆరభిరాగము—చాపుతాళము.

పల్లవి

అగ్గితిరునాళ్ళంట - అర్జుని కతలంట
ఔరా యెంతసోద్దెమే - బారతకత
ఔరా యెన్నియింతలే

అనుపల్లవి

సుగ్గీవజయము దీనిసుట్టూబలాదూరు
అగ్గురోరపు అమ్మోర్నడుగే నీసాచ్చిగ

గాన—(చెవియొగ్గివిని) అబ్బే! యీపాట యేడిసినట్టేవున్నది. గాడిదకూతలాగు ఉన్నది. అయినాకానీ యింకొక్కనిముషంవిందాము.

విస్స—(మఱింత బిగ్గరగా) చరణములు.

౧. ఇగినేశుపై నెక్కి యిభీసనూడొచ్చి
బగుపెగ్గలెన్నెన్నో పలికిదుశ్శాసుని
మొగముసూడగానే మోర్చెపోయెనట్టె
గుగురుమిగురనకుండ గుడ్లెల్లగుక్కనే—అగ్గి.

గాన—(తనలో) ఇది సుతిమించి రాగాన్ని పడుతూ వున్నది. ఇఖమాన్పింతాము. (బిగ్గరగా) యేమిటీపాట? యీవెఱ్ఱిపాట.

విస్స—వూరుకోండి. మాటాడకండి. మద్దె రసబంగం చెయ్యకండి. చాలాచరణాలువున్నవి. (అని మరింత యుత్సాహముతో పాడుచున్నాఁడు.)

చరణము

౨. ఇరన్నేశుసడ్డకు డింద్రజిత్తొకరెయ్యి
దురియోదనుని చెవిలో దూరిముక్కున నెల్లె
అరసి పిసాసాలే అశ్శద్దామనుమింగె
సురియోదమాయెనే సూడయేడుకాయె—అగ్గి.

గాన—(చెవిలలో ౙ్రేళ్ళుచెరువుకొని బిగ్గరగా) వూరుకో చాలించు యీపాటి చాలించు. చెవులు గింగురెత్తుతూ వున్నవి. వూరుకోవేమి? (అని చేయిపట్టుకొని త్రోసివేసి) నేను యేదో పొరపాటు చేసినాను. నీపేరుయెవరు?

విస్స—నాపేరు విస్సప్పపాత్రుడు. నేను వడ్డిదేశపు వఽడంగిని, కరువుకు బరంపురాన్నుంచి లేచివచ్చి యేలూరులో వఽడపుపని చేసుకుంటూ వున్నాను. పిఠాపురం తీర్థానికి మా పనివాళ్ళచేత ముందుగా అమ్మకానికి పెట్టెలుపంపివేసి నేనువెనుక వెళుతూవున్నాను.

గాన—నేను వట్టిబుద్ధిహీనుణ్ణయిపోయినాను. నీ వాగొప్ప సంగీతపాటకుడైన విశ్వపతిశాస్త్రివని భ్రమపడ్డాను. ఇందాకా మంచి పాట వినపడ్డదే. ఆపాడింది నీవుకావా?

లీలా—నాన్నగారూ ఇతడుకాడు. ఆపాడింది మీా మేనల్లుడు సంగీతరావున్ను అతనిస్నేహితుడు సుమతిన్నీ—

[సంగీతరావును సుమతియు ప్రవేశించుచున్నారు.]

సంగీ—మామగారూ! ఇందాకాపాడిందినేను. సంగీతం బాగా పాడడం నేర్చుకుంటేనేకాని మీారు కూతిరిని యివ్వనన్నారని నేను తంజావూరువెళ్ళి రాత్రీపగలూ కష్టపడి నేర్చుకొని మీాదయకు పాత్రుణ్ణికావడం నిమిత్తం మీారు యిప్పుడు విన్నమోస్తరు పాటపాడడానికి తగినపాండిత్యం సంపాదించుకొన్నాను.

సుమ—ఇతడు బహుర క్తిగా పాడుతాడు.

గాన—అబ్బాయీా! నీపాటకు నేను మెచ్చినాను. ఇఖ లీలావతి నీ సొమ్మయింది. నీకిచ్చి పెళ్ళిచెయ్యడానికి నాకేమీా ఆక్షేపణ లేదు.

విస్స—నన్ను వక్కసంగతి చెప్పనియ్యండి.

గాన—మాకు నీసంగతులూవద్దు యేమీావద్దు. నీవు యెంత శీఘ్రముగా మమ్మల్ని వదలిపెట్టివెళితే మేమంత సంతోషిస్తాము. ఓరీ! గోవిందా! మాధవా! వామనా! దారిచూపి యితణ్ణి మీారు వేగిరం వీధులోకి పంపివెయ్యండి.

[ముగ్గురు సేవకులును ప్రవేశించుచున్నారు.]

విస్స—(సేవకులతో) మీారు నన్ను ముట్టుకోవద్దు. వీరితో నేను కొన్నిసంగతులు మనవిచేసుకోవలెను. అయ్యలారా! వినండి. వీళ్ళు నన్ను బలవంతంగా లాక్కువచ్చి నాప్రయాణం చెడగొట్టి నాబట్టలన్నీ చింపివేసినారు. కాబట్టి యీాబట్టలుమాత్రం నాకియ్యండి. నాకు

యిచ్చిన పెళ్ళాన్నీ పెళ్ళివుంగరాన్నీ కూడా కావలిస్తే పుచ్చుకోండి. నాకక్కరలేదు. (అని యుంగరమియ్యఁబోవుచున్నాఁడు.)

గాన—అక్కరలేదు. ఆవుంగరం నీవు వుంచుకో. పొరపాటుచేత నేను నీకు చాలాతొందర కలుగజెసినాను. దానికి ప్రతిఫలంగా నేనీ వుంగరం నీకు బహుమానంచేసినాను. నీమూటా నీగొడుగూకూడా తీసుకుని వెళ్ళిపో.

విస్స—వెళ్ళిపోతూవున్నాను. వుంగరందొరికినందుకు సంతోషం గానేవున్నది కాని నాపాటమాత్రం కడతేరా వినకుండా పంపివేస్తూ వున్నందుకు విచారంగావున్నది. అయినా కానీ యీసారి యెప్పు డయినా యీదారిని వెళ్ళేటప్పుడు యిక్కడకువచ్చి కీర్తనఅంతా మీకు వినిపించి మరీవెళుతానులెండి. నేను వచ్చినప్పుడల్లా నేనుచేసిన పెట్టెలువమాత్రం రెండూ మూడూ కొంటూవుండండి. వెళ్ళివస్తాను. దయవుంచండి. (అని వెళ్ళుచున్నాఁడు.)

గాన—మనమందరమూకూడా లోపలికి వెళుదామురండి. ఇవాళ ఇదంతా చిన్ననాటకంలాగు జరిగింది.

[అందఱును నిష్క్రమించుచున్నారు.]

మోడరన్ ప్రెస్, కలర్ ప్రింటర్స్ & బాక్సుమేకర్స్, రాజమండ్రి.

కలహప్రియా ప్రహసనము

గ్రంథకర్త:

కందుకూరి వీరేశలింగము పంతులు

★

ప్రకాశకులు:

హితకారిణీ సమాజము,

రాజమహేంద్రవరము

1950

[వెల రు 0-4-0

కలహప్రియాప్రహసనము

— ఇందువచ్చు పాత్రములు —

వీరభద్రుఁడు—ఒకవడ్రంగి, పటాలములో నాయకుఁడు.

భీమయ్య—ఒకవడ్రంగి, కనకాంగి పెంపుడుతండ్రి.

విశ్వకర్మ—ఒకవడ్రంగి, కనకాంగివరుఁడు.

గోపాలుఁడు—ఒక గొల్లవాఁడు.

కనకాంగి—భీమయ్య పెంపుడుకూఁతురు.

సుబ్బమ్మ—ఒకచాకలిది; గూడెపునాయకురాలు.

వెంకమ్మ—ఒక చాకలిది.

బుచ్చమ్మ—ఒక చాకలిది.

శేషమ్మ—ఒక చాకలిది.

రంగము—రాజమహేంద్రవరములో గోదావరియొడ్డున చాకలి గూడెపు సమీపమున భీమయ్య యింటిముంగిలి.

[అప్పుడు బుచ్చమ్మ, శేషమ్మ, వెంకమ్మ, బట్టలమూటలు పట్టుకొని ప్రవేశించుచున్నారు.]

బుచ్చ—మనం తెల్లవారుగట్లలేచి యింటింటికీ తిరిగి బట్టలన్నీ పోగుచేసినాము. అలసటపోయిందాకా కొంచెంసేపు లోకాభిరామాయణం చెప్పుకుని మళ్ళీపనిలోకి వెళుదాము. ఏదీ మనసుబ్బమ్మ యింకారాలేదేమి? ఆవిడ లేకపోవడంచేత మనసభఅంతా చిన్నపోయింది.

వెంక—ఆవిడె యేదోపనిచేత రాలేదు గాని లేకపోతే మన కంటె ముందుగానే యిక్కడికి వచ్చివుండేది. ఆవిడెచేతులు వూరికే వున్నా నోరుయెప్పుడూ వూరికే వుండదు. ఆవిడె వచ్చేటప్పుడు యేవో కబుర్లు మూటకట్టుకుని వస్తుంది.

శేష—ఆవిడె ప్రతిదినమూ తెల్లవారిలేచేటప్పటికి యిన్ని కొత్తకబుర్లు యెక్కడనుంచి పోగుచేసుకువస్తుంది?

వెంక—మనం యీబట్టలు పోగుచేసుకుని వచ్చినట్లే వెళ్ళిన యింటికాడెల్లా నాలుగేసికబుర్లు పోగుచేసుకుని వస్తుంది. అవిడెదగ్గిర అశుకవనంకూడా వున్నది. యెక్కడా కబుర్లు దొరకకపోతే ఆవేళకు కొత్తవయినా నాలుగు కల్పించి మనకందరికీ ఖులాసాగా ప్రొద్దుజరిగేటట్టు చేస్తుంది. ఆవిడె తెచ్చేకబుర్లన్నీ పదిభాగాలుచేసి, అందులో వక భాగంలో పదోవంతుమాటలు మాత్రమే నేనునమ్ముతాను.

బుచ్చ—నిజంగా యీవూళ్ళో అందరి వ్యవహారాలూ ఆవిడెకు తెలుసును.

వెంక—ఆవిడె అందరి వ్యవహారాలలోనూ యిలాకా కలుగచేసుకుంటుంది. ఆవిడె మాటలుచూస్తే నాకువూరికే నవ్వువస్తుంది. ఆవిడె నావ్యవహారంలో ప్రవేశించకుండా వున్నంతవరకు యెవరివ్యవహారంలో ప్రవేశించినా నాకు యిబ్బందిలేదు.

[అప్పుడు సుబ్బమ్మమాట వినఁబడుచున్నది.]

బుచ్చ—ఓసీ! వూరుకో. ఆవిడెవస్తూవున్నది.

శేష—మనం ఆవిడెసంగతి మాట్లాడుకుంటూవున్నట్టు ఆవిడెకు తెలియకూడదు.

[అప్పుడు చంకక్రింద బట్టలమూటపెట్టుకొని సుబ్బమ్మ ప్రవేశించుచున్నది.]

సుబ్బ—అమ్మలారా! యెన్నడూలేనిది నేను యివేళ మీ అందరి కంటెనూ ఆలస్యంగా రావలసివచ్చింది. అయితే యేమిలెండి. కబుర్లు లేకుండా యిదివరదాకా వృధాఅయిన కాలమంతా వక్కనిముషంలో కూడతీస్తాను. యివేళమీలో యెవరైనా కనకాంగిని చూచినారా? యివేళ ఆవిడెకు పెళ్ళిసుమా.

బుచ్చ—యెక్కువ సొగసుగా కనపడడానికి యివేళ ఆవిడె దువ్వుకోవడంలోనూ తొడుక్కోవడంలోనూ వున్నది. ఆవిడెదర్శనం మనకెక్కడ అవుతుంది?

సుబ్బ—యీపెళ్ళి సార్లాపడదు. నేను ముందుగానే చెపుతూ వున్నాను వినండి. పెళ్ళిఐనా దంపతులు సుఖపడరు. ఆపెళ్ళికొడుకువిశ్వకర్మ వట్టిగర్వపోతు. అంతే కాకుండా అతను పెళ్ళికోసం గొప్పవేషం వేసినాడు.

వెంక—అలాగా?

సుబ్బ—అతను గోదావరిగట్టు కారుఖానాలో పనిలోవుండి యిప్పుడు వీళ్ళతో ఆకారుఖానా అంతా తనదేనని చెప్పినాడు. జంగం పేరయ్య కనకాంగి పెళ్ళికోసం పట్టురవికా పట్టుచీరేతీసుకొని వెళుతూ వుండగా చూచినాను. ఆపట్టుచీరెకు చుట్టూజరీనక్కి వేసి కుట్టినాడు. వడ్రపుపనిచేసుకునేవాడి కూతురు కేమిటి? పట్టుచీరెయేమిటి? ఇలాగు తలకుమించిన వ్యయంచేసి సంసారం పాడుచేసుకోవడంచూస్తే భీమయ్య వట్టి బుద్ధిహీనుడుగా కనపడుతూవున్నాడు. ఇదంతాచేస్తే యిది వాడి కూతురవునోకాదో!

బుచ్చ—ఏమీ! కనకాంగి అతని కూతురేకాదా?

సుబ్బ—మీరు నన్నాప్రశ్న అడగకండి. ఇది అతనికూతురు అయితే అవనేఅవుతుంది. కాకపోతే కానేకాదు.

బుచ్చ—ఇందులో యేదోరహస్యంవున్నది. చెప్పు చెప్పు.

సుబ్బ—నేను లక్షవరహాలుయిచ్చినా చెప్పను. పాపం! ఆచిన్న దానిమీద అపవాదలు వెయ్యడం నాకు యెంతమాత్రమూ యిష్టంలేదు.

వెంక—నీవు మాకుచెప్పకపోతే చెప్పకపోయినావుకాని కన కాంగి గుట్టుయేదో నీకు తెలిసింది. అంతమట్టుకు నిశ్చయం.

శేష—సుబ్బమ్మా! నావక్కదానితోనూ చెప్పు. నేను యెవరి తోనూ చెప్పను.

సుబ్బ—నేను యెవరితోనూ చెప్పను. దానిసంగతి మాఅమ్మ నిన్నసాయంకాలం నాకు యెంతోరహస్యంగా చెప్పింది. నేను యీ సంగతి నావదినెగార్ల ముగ్గురితోనూమాత్రం చెప్పినాను. అటు తరు వాత నా ప్రాణస్నేహితులయినవారితో అయిదుగురితోనో ఆరుగురి తోనో యేకాంతంగా చెప్పినాను. వీరితోతప్ప యింతవరకు నేను యీ సంగతి వక్కపిట్టతో చెప్పలేదు. అజాగ్రతగా వున్నప్పుడు యిప్పుడు మాటలపరాకున మీదగ్గిర కొంచెం నోరిజారి పయికివచ్చింది.

వెంక—నేను యీసంగతి యెంతరహస్యంగా వుంచుతానో నీకే తెలుసును.

బుచ్చ—నాచెవులలో పడ్డమాట పయికిరాదనీ నీకే తెలుసును.

శేష—నానోట్లోమాట నానోట్లోనే వుటుందిగాని వెలుపలకు గాదనిమాత్రం నీకు తెలియదా?

సుబ్బ—అలాగయితే మీమాటనమ్మకంమీద మీతోకూడా చెపుతాను? ఈభీమయ్యకు పూర్వం వకపెళ్ళామూ కూతురూకూడా వుండేవారు. అత్తవారియింటికివెళ్ళినప్పుడు అక్కడ మరిడీజాడ్యాలచేత

యిద్దరూకూడా చచ్చిపోయినారు. అటు తరువాత యితనుకొన్ని యేళ్ల దాకాయీవూరికిరాక అక్కడనేవుండి కొంతకాలానికి యీపిల్లను తీసుకొని మళ్లీవచ్చి యీయింట్లో ప్రవేశించినాడు? అందరూ యీచిన్నది యితనికూతు రనుకుంటూ వున్నారు.

వెంక—ఇదినీకు నిశ్చయంగా తెలుసునా?

సుబ్బ—అప్పుడు మాఅమ్మ వీళ్ళయింట్లోబట్టలువుతుకుతూవుండేది. వీళ్ళసంసార స్థితి అంతా దానికి బాగా తెలుసును.

వెంక—అయితే కనకాంగియెవరయివుంటుంది?

సుబ్బ—ఎవరికి తెలుసును? అయితే వకవేళ అతనికూతురే అయివుండవచ్చును. దానికేమికాని విశ్వకర్మ యెంతదుర్మార్గుడో చూచినావా?

బుచ్చ—ఎందుచేత?

సుబ్బ—వెనుక యితను ఆకారుఖానాలో వకవడ్రంగి కూతురుని పెండ్లిచేసుకుంటానని ఖరారుచేసినాడు. యిప్పుడు యీవివాహం సంగతి తెలియడంతోటే పాపం ఆచిన్నది చిక్కిసగమయిపోయింది. మొగవాళ్ళు మోసంచేస్తారు. పెళ్ళివిషయంలో మనంమగవాళ్ళను యెప్పుడూ నమ్మకూడదు. జాగ్రత! మీలోయెవరూనమ్మి మోసపోకండి. (అప్పుడొక్క సుబ్బమ్మతప్ప తక్కినవారందఱును బట్టలపాకలోనికివెళ్ళుచున్నారు.)

[పెండ్లిచీరకట్టుకొని యింటిలోనుండి కనకాంగి వచ్చుచున్నది.]

సుబ్బ—(ముందుకువెళ్ళి కనకాంగిచేయిపట్టుకొని) అమ్మాయీ! యీదినంనిన్నుచూస్తే నాకుబహు సంతోషంగావున్నది. యీచీరె నీకుయెంతో అందంగావున్నది. (అనిపాకలోని చాకెతలతో రహస్యముగా) నేనీమాటలంటే దీని కెంతభయముగా వున్నదో చూచినారా?

అందఱు—ఆహాహాహా (అనిపకపక నవ్వుచున్నారు.)

కన—నా స్నేహితుల కందరికీ యీాదినం బహుఖులాసాగా వున్నది.

[అప్పుడింటిలోనుండి భీమయ్య ప్రవేశించుచున్నాడు.]

భీమ—సుబ్బమ్మా! క్షేమమా?

సుబ్బ—యీాదినం మీాదర్శనంకావడమే నాకుక్షేమం. మీా దర్శనం దొరకడంచేత నాకు బహుసంతోషంగా వున్నది.

భీమ—చాకలమ్మలందరూ మహాపనిమీాద వున్నారు.

అంద—అవును. పనిమీాద నేవున్నాము. హాహాహా! (అని నవ్వుచున్నారు.)

సుబ్బ—నేను కూడాపోయి పనిచేసుకోవలెను. (అని పాకలోనికి వెళ్ళుచున్నది.)

భీమ—అమ్మాయీ! నీపెల్లికంతాసిద్ధమయింది. బంధువులనందరినీ పిలిచివచ్చినాను. లగ్నసమయంలోవచ్చి వక్కసారి వధూవరులను ఆశీర్వదించిపోవలసిందని నాగాచార్యుల పెళ్ళాన్నిమరీమరీ ప్రార్థించినాను. అంతదూరం రాలేనన్నది.

సుబ్బ—(చాకెతలతో) నాగాచార్యుల పెళ్ళాన్ని రమ్మని ప్రార్థించినాడట! ఆవిడె సుకుమారం చూచినారా?

అంద—హీహిహీ. (అనినవ్వుచున్నారు.)

భీమ—(ఆవంకజూచి) ఏమి నాగాచారి పెళ్ళామంటే మీాకింత పరిహాసంగా వున్నదా! ఆవిడె సుకుమారికాదా!

సుబ్బ—కాకేమి? ఆవిడె మహాసుకుమారి. మొగుడుఆవిడెను యింట్లోయేమీా పనిచెయ్యనియ్యడు. వక్కసూరయ్యగారి కుమా

రుడు వస్తేతప్ప మరియెవరువచ్చి పిలిచినా ఏధితలుపయినా భార్యను వెళ్ళితియ్యనివ్వడు. సూరయ్యగారి కుమారుడుపిలిస్తే మాత్రం ఆవిడే స్వయంగావెళ్ళి తలుపుతీస్తుంది. ఆయనయింట్లో ప్రవేశిస్తాడు; ఇంటి యజమాని వెంటనే వీధిలోకి పనిమీదవెళుతాడు. ఇదినేను ప్రత్యక్షంగా చూచినాను.

భీమ—సంసార్లమీదలేనిదోషాలు వెయ్యరాదు. యీవక్క రోజయినా పరులను ఆడిపోసుకోవడం మానివెయ్యండి. ఆనికె పిలువ లేదంటారు. మీగందరూవచ్చి మాఅమ్మాయి పెళ్ళిచూచిపొండి.

సుబ్బ—నాకు యెవరిమీద ద్వేషంలేదు. నేనుయెప్పుడూ యెవరిమీద లోకంలోవాళ్ళవలె లేనిపోని దోషాలు చెప్పను. యింత ప్రొద్దుయెక్కినా పెళ్ళికొడుకు యింకావచ్చినాడుకాడు. యిలాగు మీకందరికీ ఆయాసంకలుగచెయ్యడం విశ్వకర్మకు ధర్మంకాదు. నేను వకవేళ పెళ్లికిరాలేకపోయినా నీకూతురికీ అల్లుడికీ యెప్పుడూ శుభం కోరుతూవుంటాను.

[అప్పుడు చాకెతలందఱును పాకలోనుండి యీవలకు వచ్చుచున్నారు]

వెంక—పెళ్లికినేనూ రాలేను.

బుచ్చి—నేనురాలేను.

శేష—నేనురాలేను.

సుబ్బ—యెక్కడికైనావెళ్లితే తనతో సమానమయిన వాళ్ళ యింటికి వెళ్ళవలెను గాని తనకంటె తక్కువవాళ్ళయింటికీ వెళ్ళకూడదు. యెక్కువవాళ్ళయింటికీ వెళ్ళకూడదు. నేను యీవూళ్ళో చాకల వాళ్ళలో యింతపరువుగా బ్రతుకుతూ వున్నదాన్నే కాని వట్టి దాన్నికాను.

బుచ్చ—కొంచెం ఎక్కువతక్కువగా నేనునీఅంతపరువుగలదాన్నే.

శేష—నాపరువూ మీాయిద్దరికంటెనూ తక్కువయిందికాదు.

వెంక—నా మొగుడు కచేరీమసాల్చీపనిలో వున్నాడు. నాచేతులో నాలుగురూపాయల సొమ్మువున్నది. నాకుమాత్రం పరువుకు యేమితక్కువ?

సుబ్బ—అలాగయితే మనమందరమూ సమానమైనపరువుగలవాళ్ళమే. మనలో పరువుతక్కువవాళ్లు వక్కరూలేరు.

భీమ—ఇప్పుడు నేను మిమ్మలినందరినీ పేరంటానికి పిలుస్తావున్నాను.

సుబ్బ—నేను బహుశావస్తాను. కనకాంగి నాకు ప్రాణస్నేహితురాలు.

బుచ్చ—నేనూ ముఖ్యస్నేహితురాలనే.

వెంక—నేనూను.

శేష—నేనూను.

భీమ—అలాగయితే మీారందరూ యిళ్ళకువెళ్ళీ పెళ్లీముస్తాబయిరండి.

వెంక—నేనుబజారులో పట్టుమల్లరవిక కొనుకుంటాను. (అని వెళ్లుచున్నది.)

శేష—నేనూపట్టురవికే కొనుక్కుంటాను. (అని వెళ్ళుచున్నది.)

బుచ్చ—మీారందరూ రవికెలు కొనుక్కుంటే నేనుచీర కొనుక్కుంటాను. అందరమూ కలసివెళుదాముగండి యిక్కడ మనబట్టలు సుబ్బమ్మ చూస్తూవుంటుంది. (అని యందఱును వెళ్లఁగా, సుబ్బమ్మ పాకలోనికి పోవుచున్నది.)

కన—నాన్నగారూ! మీ అల్లుడు యింతసేపటిదాకా రాకపోవడానికి కారణం యేమయివుంటుంది?

భీమ—అతడు పెళ్లికి యిపీఅవీ సవరించుకుంటూవుండి వుంటాడు.

సుబ్బ—(పాకలోనుండి) అంతతొందరపడకండి. పడుచువాడు వివాహానికి వచ్చేటప్పుడు చక్కబెట్టుకోవలసినవ్యవహారాలు యెన్నైనా వుంటవి. పూర్వపుసంబంధాలన్నీ వదులుకోవలెను; ఇవ్వవలసినచోట్ల యిచ్చి సమాధానపరచవలెను.

భీమ—దానిమాటలకేమి? సుబ్బమ్మ యెప్పుడూ యిలాగంటి మాటలే అంటూవుంటుంది. విశ్వకర్మ యిప్పుడేవస్తాడు. అమ్మాయీ! నీవు యిక్కడ కనిపెట్టిచూస్తూవుండు. నేను యింతలో లోపలకావలసినవన్నీ సిద్ధంచేస్తూవుంటాను. (అని యింటిలోనికి వెళ్లుచున్నాఁడు.)

కన—అడుగో అతడు వస్తూవున్నాడు.

(అప్పుడుచేత బుట్టపట్టుకొని విశ్వకర్మ ప్రవేశించుచున్నాఁడు.)

విశ్వ—ఓప్రియురాలా! నీకోసం బజారులో కొన్నివస్తువులు కొనేటప్పటికి కొంచెం ఆలస్యంఅయింది. మనం సొమ్ము వృథాగా పోగొట్టరాదు. అందుచేత వస్తువులు యెక్కడ చవకగా దొరుకుతవో అక్కడ కొందామని బజారంతా తిరిగేటప్పటికి యింత ఆలస్యం అయింది.

సుబ్బ—(పాకలోనుండి) విశ్వకర్మగారూ! మీరు క్షేమముగా వున్నారా? మిమ్మునిని చాలాకాలానికి చూచినాను. మీరు మహా అదృష్టమంతులు.

విశ్వ—సుబ్బమ్మా! మీచాకిరేవు యిక్కడనేనా?—కనకాంగీ! ప్రియురాలా! నీవు వుండవలసినంత సంతోషంగా కనబడవేమి?

కన—యేమీలేదు. మీరు యింతసేపటిదాకా యెందుకువచ్చినారుకారా అని యిదివరదాకా అలోచిస్తూవున్నాను.

విశ్వ—నేను యెందుకోసం ఆలస్యంచేసినానో నీకు తెలిసిందిగనుక యిఖవిచారం పెట్టుకోరాదు. చూడు యిదుగో నీకెన్ని వస్తువులు తెచ్చినానో! దంతపుమువ్వేన్న వకటీ; వకబొట్టు పెట్టె; యిత్తడి కుంకంబరిణె; యిత్తడికాటుకకరాటం; యిత్తడికాటుకకరాటం; యిత్తడి పాందాను; యిత్తడి అడకొత్తు; యిత్తడి సున్నపకాయ; మంచిఅద్దము; అయిదుబొంబాయిరవికెల గుడ్డలు; రెండుపట్టురవికెలు; వకమధురచీరె; రెండువుప్పాడ చీరెలు. ఇవన్నీ చూచినతరువాతనైనా నీ మనస్సుకు తృప్తికరంగా వున్నదా?

కన—వున్నది. (అని యీవస్తువులు పయికితీసిచూచి మరల బుట్టలో పెట్టుచున్నది.)

సుబ్బ—(పాకలోనుండివచ్చి) విశ్వకర్మగారూ! యీవస్తువులన్నీ యెక్కడ కొన్నారు?

విశ్వ—మావస్తువులసంగతి నీకెందుకు?

సుబ్బ—నాకక్కరలేదుగాని వూరికే అడిగినాను.

విశ్వ—కనకాంగీ! యీమధురచీరెకట్టుకుంటే నీవుయెట్లావుంటావో చూడవలెనని వున్నది.

సుబ్బ—బహుబాగావుంటుంది. రంభలాగువుంటుంది. ఆమధురచీరె యిప్పుడు కట్టుకున్న పట్టుచీరెను మించి వుంటుంది.

విశ్వ—ఓహోహో! నేను చూడనేలేదు. ప్రియురాలా! నీకు పట్టుచీరెకూడా వున్నదా?

కన—ఈపట్టుచీరె నావంటికి తగివున్నదనుకుంటాను.

సుబ్బ—(విశ్వకర్మతో రహస్యముగా) ఆపట్టుచేరె మహారాజుల పెళ్ళాలు కట్టుకోవలసిందిగాని సాధారణమైన నీవంటి వడ్రంగి పెళ్ళాం కట్టుకోతగ్గదికాదు. ఇలాగు తలకుమించిన వేషాలువేస్తే చూచినవారు నలుగురూ నవ్వుతారు. ఇలాగంటివేషాలు సాగనిస్తే వక్కరోజులో నీ యిల్లు గుల్లఅవుతుంది. ఈపట్టుచీరె కనకాంగికి యివరో యిచ్చినారట.

విశ్వ—ఏమీ! యెవరో యిచ్చినారా?

సుబ్బ—వూరుకో. మెల్లిగా.

విశ్వ—(తనలో) సుబ్బమ్మ చెప్పినమాట నిజమయ్యేవుంటుంది. (బిగ్గరగా) కనకాంగీ! నీకు ఈచీరెయెవరు యిచ్చినారు?

సుబ్బ—(కనకాంగితో రహస్యముగా) ఆ అడగడంధోరణి చూచినావా? అప్పుడే పెళ్ళాంమీద అధికారం చెయ్యడాని కారంభించినాడు.

కన—మా బాబు కొనిపెట్టినాడు.

సుబ్బ—(విశ్వకర్మతో) రహస్యముగా) నీవామాటలు నిజమనే నమ్మతావా?

విశ్వ—కనకాంగీ! నీవు యీపట్టుచీరెకట్టుకుంటే చూచినవాళ్ళు యేమనుకుంటారు? వడ్లవాడిపెళ్ళానికి పెళ్ళిలోనే యీనీటేమిటని నలుగురూనవ్వరా! నీకు యిదితగదు.

కన—పయివాళ్ళు నవ్వుతుంటే నవ్వుకోనియ్యండి. మనకేమి?

విశ్వ—(బిగ్గరగా) నీకు నేను యిదితగదని చెపుతూవుంటేను—

సుబ్బ—(విశ్వకర్మతో రహస్యముగా) మేలుమేలు! అలాగు వుండవలెను. చివరకు యేమిచేస్తావో యిందులో నీ మొగతనం తెలుస్తుంది.

కన—యిది మా బాబు—

విశ్వ—మీ బాబుమాట నాతోచెప్పకు. నాకది జరూరులేదు.

సుబ్బ—ఇటువంటి స్వల్పవిషయంలో తగువులాడకండి. మీరు పెళ్ళికాకముందే యిలాగుపోట్లాడితే పెళ్ళయిన తరువాత కూడా యెప్పుడూ పోట్లాడుతూనే వుంటారు. ఈపనికిమాలిన పట్టుచీరెకోసం యింతకలహం యెందుకు?

విశ్వ—(ముందుకువచ్చి) నేను యిప్పుడే చెపుతూవున్నాను. నలుగురిచేతా నవ్వించుకోవడం నాకు యిష్టంలేదు.

కన—యెవరూ యెందుకునవ్వుతారు? ఇది నాకు మాతండ్రి కొనిపెట్టినాడు.

సుబ్బ—(విశ్వకర్మతో రహస్యముగా) ఇలాగంటి పట్టుచీరె కొనిపెట్టడానికి దీనితండ్రిదగ్గర డబ్బు యెక్కడయేడిసింది?

కన—మళ్ళీచెపుతాను. దీన్ని నాకు మాతండ్రి కొనిపెట్టినాడు. నేను కట్టుకుంటూను. నన్నుచూచి నవ్వడానికి యెవళ్ళసొమ్ము యేమి పడిపోయింది?

సుబ్బ—(కనకాంగితో రహస్యముగా) బాగాచెప్పినావు.

విశ్వ—నీవు యీచీరె కట్టుకోకూడదు.

సుబ్బ—(విశ్వకర్మతో రహస్యముగా) నీదగ్గిర మొగతనం కాస్త కనపడతూవున్నది. ఆడదానికిలోబడకు.

విశ్వ—లోబడను.

కన—మీరు నిష్కారణంగా యెందుకు తగువులాడుతారు?

విశ్వ—నేనా? నేను తగువులాడడంలేదు.

సుబ్బ—(కనకాంగితో రహస్యముగా) ఈమొగుణ్ని చేసుకుని నీవు సుఖపడవు.

విశ్వ—నీవాచీరె విప్పివేస్తావా వెయ్యవా?

సుబ్బ—కనకాంగితో రహస్యముగా వెయ్యనను. నీకేంభయం?

కన—వెయ్యను.

విశ్వ—అలాగైతే నీజోలి నాకక్కరలేదు. ఇప్పుడే నేను చెప్పినమాట విననిదానవు యిఖ ముందేమివింటావు?

సుబ్బ—(విశ్వకర్మతో రహస్యముగా) మేలుమేలు! నీవు నా మనసువచ్చిన మగవాడవు. మగతనంఅంటే యిలాగువుండవలెను.

కన—యిటువంటి స్వల్పవిషయంలోనే యిలా తామసంవస్తూవుంటే, ముందు నిజంగా నాయందు తప్పిదం ఉన్నప్పుడు మీరు నన్ను యేలాగు సార్లాచేస్తారు?

సుబ్బ—(కనకాంగితో రహస్యముగా) తగినట్టు బుద్ధిచెప్పినావు. ఆడదానవంటే నీవే ఆడదానవు.

విశ్వ—నీకు పట్టుచీరెమీదనూ వేషంమీదనూ తప్ప మరి దేనిమీదనూ ధ్యానంలేదు.

కన—నీవు యెప్పుడూ నీగొప్పతనమే చూచుకుంటావు. నీవు గర్విష్ఠివి.

విశ్వ—నీవు పనికిమాలిన గయ్యాళివి.

కన—(వెనుకతిరిగి వెళ్ళుచు) అవునవును. నన్నలా అనవలసినదే. ఇక నేటినుంచి నాకు నీతో సంబంధంవిడిపోయింది. (మరల ముందుకువచ్చి) ఇఖ నేను నీతోయెప్పుడూ మాట్లాడను.

విశ్వ—(వెళ్ళుచు) మంచిది. యిఖ నేనూ నీతోయెప్పుడూ మాట్లాడను. (అని మరల వచ్చుచున్నాడు.)

కన—ఇదిగో నీవుతెచ్చినవస్తువులూ బుట్టాకూడా తీసుకుని వెళ్ళు. (బుట్టముందుకు త్రోచి) ఈపనికిమాలినవస్తువులు నాకక్కరలేదు. నీవినీవే తీసుకునివెళ్ళు.

విశ్వ—మంచిది. అలాగే తీసుకొనివెళుతాను. (తనలో) ఇవి తీసుకునివెళ్ళి సఖంఖరీదుకైనా మళ్ళీ అమ్మివేస్తాను.

కన—మీరు నాదగ్గిరగారాకండి.

విశ్వ—యెప్పుడూరాను.

కన—మనకు యిదే ఆఖరుచూపు. (అని యింటిలోనికి వెళ్ళుచున్నది.)

విశ్వ—యిదే ఆఖరుచూపు. (అని వెళ్ళుచున్నాఁడు.)

సుబ్బ—(నవ్వుచు) హాహాహా! నాకిప్పుడు పరమసంతోషంగా వున్నది. చెప్పుకుని నవ్వుకోడానికి మాకు యీవేడుక రెండురోజుల దాకా సరిపోతుంది. ఇది వూళ్ళో యెలాగుచెప్పవలెనో ఆలోచించుకోవలెను. మనం చెప్పేటప్పుడు భీమయ్యకూడా దగ్గిరవున్నట్టే చెప్పవలెను. అలాచెపితేనేకాని కథలో సొగసేవుండదు. విశ్వకర్మ చీరె నిన్నుకట్టుకోనియ్యనంటే, కనకాంగి నేనుకట్టుకోకమాననన్నది. అందుమీద విశ్వకర్మ నీకాచీరె యెలావచ్చిందన్నాఁడు. దానికి యెలావస్తే యేమి దానిమనసు వచ్చినచోట సంపాదించుకొన్నదని తండ్రి అందుకున్నాఁడు. ఆపయిని చీరెకట్టుకోకూడదని వకరూ, కట్టుకోక మాననని వకరూ, కట్టుకుంటే యేమిచేస్తావని వకరూ, ముగ్గురూ మాటామాటా అనుకొని తరువాత కలియబడికొట్టుకొని దెబ్బలాడి లేచిపోయినారని చెపుతాను. మధ్యకొట్టుకోవడం పెడితేనేకాని వినేవాళ్ళకు యింపుగా వుండదు. ఆదెబ్బలాటలో విశ్వకర్మ కనకాంగినికొట్టి కిందబడద్రోసినాడు. కనకాంగి కిందపడి యేడుస్తూలేచి విశ్వకర్మ మొఖమంతా బరికింది. దానిమీద కోపంవచ్చి విశ్వకర్మ కనకాంగి కొప్పుపట్టుకొని పీకేటప్పటికి గుప్పెడు వెంట్రుకలు చేతులోకి వూడివచ్చినవి. అప్పుడు భీమయ్య కలియబడి విశ్వకర్మబట్టలన్నీ చింపినాడు. అటుతరువాత

తండ్రీ కూతురూ చేరి వంటిగాణ్ని చేసి బ్రహ్మరాక్షసులలాగు మీాద పడి చావకొట్టేటప్పటికి విశ్వకర్మ వాళ్ళతో గెలువలేక పారిపోయినాడు. యేసంబంధంలో నయినా కనకాంగి మూర్ఛవచ్చి క్రిందపడిపోయిందని కూడా చెప్పవలెను. ఆహాహాహా! ఇప్పుడు వినడానికి యెంతయినా వేడుకగావుంటుంది. యితరుల పోట్లాటంటే నాకుపండుగ.

[అప్పుడు వీరభద్రుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

వీర—(ముందుకువచ్చుచు) ఇక్కడితో నాప్రయాణం తుద ముట్టింది. భీమయ్యయిల్లు యీాసమీాపంలోనేనని చెప్పినారు. పాపం కనకాంగి యెట్లావున్నదో! దాన్ని నేను యిప్పుడానవాలు పట్టలేనను కుంటాను. తనకు వక అన్నగారు వున్నాడన్న సంగతయినా దానికి తెలియదు. వక కారణంచేత యీాసంగతంతా దాచవలసివచ్చింది. (సుబ్బమ్మనుచూచి) అమ్మా! వక్కసారి యిలాగువస్తావా?

సుబ్బ—(పాకలోనుండి వచ్చి) నాయనా! యేమికావలెను? బట్టలు వుతకడానికి చాకలిదికావలెనా? యీావూళ్ళో నాతోసమానంగా బట్టలువుతికేవాళ్ళు యెవరూలేరు. నెలజీతానికి కుదుర్చుకుంటారో చాకిరేవుకు యింతనియిస్తారో మాట్లాడుకోండి.

వీర—నాకు వడ్రంగి భీమయ్యయిల్లు యెక్కడో చెప్పవలెను.

సుబ్బ—భీమయ్యయిల్లా? మీారు కుర్చీలుకొంటారు కాబోలును.

వీర—నాకు యేమీా అక్కరలేదు. అతనియిల్లు మాత్రమే కావలెను?

సుబ్బ—అతడు మీాకు యిప్పుడు కనపడడు. అతనికి యిప్పుడు మనసు స్థిమితంగాలేదు. ఈవుదయాన్న అతనికూతురు కనకాంగికి పెళ్ళిలగ్నం పెట్టుకున్నారు. పెళ్ళి చెడిపోయినది.

వీర—కనకాంగికా పెళ్ళి?

సుబ్బ—అవును కనకాంగికే. అదంతా మీతో చెపుతాను వినండి. కనకాంగికి గర్వంయెక్కువ. తనస్థితికిమించిన వేషంవేసుకుని తిరుగవలెనంటుంది. అందుచేత వూళ్ళోఅందరూ యెక్కడచూచినా కనకాంగిమాటే చెప్పుకుంటారు.

వీర—కనకాంగి మంచిదికాదని చెప్పుకుంటారా?

సుబ్బ—బొత్తిగా మంచిదికాదని చెప్పుకుంటారు. ఆమాటలు వినే తీరాపెళ్ళి సిద్ధమయ్యేటప్పటికి ప్రొద్దున్న యింటికివచ్చినవాడేపెళ్ళికొడుకు యిఖతాను కనకాంగిని పెళ్లిచేసుకోనని అనవలసినమాటలు మొఖంమీద అసివేసి వెళ్లిపోయినాడు. ఈపెళ్లి తప్పిపోవడంవల్ల వచ్చిననష్టంయేమీలేదు. ఆపెళ్ళికొడుకు వట్టిదౌర్భాగ్యుడు.

వీర—నేను పనిలోవుండి కీర్తిసంపాదిస్తూవుంటే నాచెల్లెలు యీవూళ్లోవుండి యింత అపఖ్యాతి తెస్తూవున్నదా? నాకు బహువిచారంగావున్నది. భీమయ్య యిల్లు యేదో వెంటనేచెప్పు.

సుబ్బ—అయ్యో! నీవు కనకాంగి తోడబుట్టినవాడవా? యీమాటలుచెప్పి మీ మనస్సు కాయాసం కలుగజేసినందుకు నాకు విచారంగా వున్నది. నేను యిప్పుడు మీతో చెప్పినదంతా యెవ్వళ్ళోగిట్టని వాళ్ళు వూళ్ళో చెప్పుకొన్నమాటలుకాని ఆ పుణ్యమూ పాపమూ నేనేమీ యెరుగనుసుమా నేను యెరిగినంతమట్టుకు ఆచిన్నదాని వద్ద వక్కదుర్గుణం కనపడదు. ఆ చిన్నది అన్నగారు వచ్చినారంటే బహుసంతోషిస్తుంది. అంతబుద్ధిసుంతురాలు యీ చుట్టుపట్ల ఆడవాళ్ళలో మరియెవ్వరూలేరు. ఆ వినయం యేమి? ఆకలిసికట్టుతనంయేమి? ఆదయూదాక్షిణ్యాలేమి? ఆమాటపొందికయేమి? యీవీధివాళ్ళంతా కనకాంగిని వెయ్యినోళ్ళస్తుతిస్తూవుంటారు. నీవు చెల్లెలికి చాలా డబ్బుతెచ్చినట్టున్నది.

వీర—ఇదేమిటి? యేదిపట్టుకున్నా వదలవు. నాకు చావుగా వున్నది. కాస్తసేపు నీకథకట్టిపెట్టి నాకాయిల్లు చూపించు.

సుబ్బ—భీమయ్యగారియింల్లా? అతనియిల్లుయిదే.

వీర—ఇంతసేపు చంపకపోతే యీమాట మొట్టమొదటనే చెప్పలేకపోయినావా? (అని లోపలికి వెళ్ళుచున్నాఁడు.)

సుబ్బ—ఇతడు డబ్బుగలవాడు. అందుకు సందేహంలేదు. కనకాంగి భీమయ్యకూతురు కానిమాట యిప్పుడు స్పష్టపడింది. ఈవెడెవరో మహాధనికుడికూతురు. ఇందులో యేదోపరమరహస్యంవున్నది. అడుగో విశ్వకర్మవస్తావున్నాడు. కనకాంగికి భాగ్యవంతుడైన తోడబుట్టిన వాడున్నాడన్న సంగతి వింటే వాడు మరీ యేడుస్తాడు.

[అప్పుడు విశ్వకర్మ ప్రవేశించుచున్నాఁడు.]

విశ్వ—ఏమిబుద్ధి? నేనుయిప్పుడు యేమిచెయ్యను! నేను బుద్ధిహీనుణ్నయి నిష్కారణంగా మంచిమాటలాడవలసిన దానికిబదులుగా తగువుంలాడినాను. ఎలాగైనా ఆడదానిమాట సాగనియ్యకూడదు. అది పట్టుచీరె కట్టుకోవడం మానివెయ్యవలెను.

సుబ్బ—విశ్వకర్మగారూ! మీకొకవిశేషం చెప్తాను యిలాగు రండి. మీరు యిందాకా పట్టుచీరె కట్టుకున్నందుకే హాశ్చర్యపడిపోయినారు. యిప్పుడు కనకాంగికి బనారసుచీరెలూ మోహిరీలపేర్లూ వజ్రాల నగలూ పెట్టుకోవలసిన యోగంపట్టింది.

విశ్వ—ఛెస్సి యిదంతా అబద్ధం.

సుబ్బ—ఛెశ్శని మీరు నామాట అబద్ధంకిందకట్టి వెయ్యవచ్చును. ఆచిన్నది భీమయ్యకూతురుకాదు.

విశ్వ—కాదూ?

సుబ్బ—కాదు. ఆవిడెవరో జమీందారుకూతురు. ఆవిడెఅన్నగారు యిప్పుడే వచ్చినాడు. నేను కళ్ళారా చూచినాను. ఆయనమాటలు నేను చెవులారా విన్నాను. ఆయన బహుదొడ్డవాడు. ఆయన మెనిమిది గుర్రాలబండిలో వచ్చినాడు. బండీ యీగుమ్మందగ్గిరనే నిలిచింది. ఆయనబండీదిగి నావద్దరకు వచ్చినాడు. ఆయనను చూచేటప్పటికి నాకు సిగ్గుచేతనూ భయంచేతనూ కంపంయెత్తి వళ్లంతా చెమట పోసింది. అప్పుడు నేను మూర్ఛవచ్చి కింద పడిపోతానను కున్నాను. ఆయనకు కాస్తయినా గర్వంలేదు. కనకాంగి సంగతీ భీమయ్యసంగతీ నన్నడగి చెల్లెలికి కావలసినంతధనం తీసుకునివచ్చి నానని నాతో చెప్పినాడు. ఆయనతో నీపేరు చెప్పి నీవు మహామంచి వాడవని చెప్పినాను. ఆయన యీపాకలోకి వచ్చి నాబట్టలు వుతకడంచూచి సంతోషించి నాకు తమ సంస్థానంలోపని యిప్పిస్తామన్నారు. ఆ మాటలు చెప్పి నవ్వుతూ ఆయన దేవదూతలాగు యీయింట్లోకి వెళ్లినాడు.

విశ్వ—ఇఖనాబ్రతుకు యేమవుతుంది? నేను చెడిపోయినాను.

సుబ్బ—నీవు మొదలంటా చెడిపోయినావు. నీవు ప్రొద్దున్న బుద్ధిపోయి అలా పోట్లాడకుండా వున్నట్టయితే యీపాటి కనకాంగి నీకు భార్య అయివుండును. అప్పుడు నీకు ముప్పయి నలభయి వేల రూపాయల ఆస్తి వచ్చివుండును. ఆ రూపాయలసంచులు చూచుకుంటే యీలాటి పిచ్చయెత్తక పోయిందా?

విశ్వ—ముప్పయినలభయివేల రూపాయలా? అన్ని రూపాయలువుంటే గొప్ప గారుఖానా పెట్టవచ్చును. మరిప్రొద్దున్న ఆచిన్నదానితో పోట్లాడడానికి నన్ను నీవు యెందుకు పురికొల్పినావు?

సుబ్బ—నిన్ను నేను పోట్లాటకు పురికొల్పినానా? సరిసరి! ఇది మరీబాగావున్నది. నేను ప్రొద్దున్న నీతోవక్కమాట మాట్లాడలేదు. (అని పాకలోనికి వెళ్ళుచున్నది.)

విశ్వ—నీ మాటలువింటే నాకు పిచ్చియెత్తిపోతూవున్నది. నీవాడదానవై పోయినావుగాని మగవాడవై నట్టయితే యీపాటి నా పగంతా తీర్చుకుందును. నేనిప్పుడు యేమిచెయ్యను? వూళ్ళోవాళ్ళంతా యిఖ నన్నుచూస్తే పరిహాసంచేస్తారు. ఇఖ నాకు నిశ్చయంగా చావు వ్రాసింది. నేను నూతిలోనో గోతిలోనో పడవలెనుగాని నాకు పెళ్లాడి భార్యాతో సుఖంగా కాపురం చెయ్యవలసినయోగంలేదు. యిందాకా పిలిచినారు. పంతులుగారికుర్చీ బాగుచేసివచ్చి యేదోసాహసకార్యం చేసుకుంటాను. (అని వెళ్ళుచున్నాఁడు.)

[అప్పుడింటిలోనుండి వీరభద్రుఁడును భీమయ్యయు
ప్రవేశించుచున్నారు.]

వీర—నేను విన్నదంతా అబద్ధమని నీవు నమ్మకంగా చెప్పడం వల్ల నామనస్సులో విచారమంతా పోయినది. నీవు చెప్పినట్లుగా మన కనకాంగి గర్వములేనిదీ అనువర్తనకలదీ అయివున్నట్టయితే నేను యిప్పుడు యిక్కడకు వచ్చినందుకు నాకు సంతోషమే కాని విచారం వుండదు. అది యిప్పుడు యింట్లోలేదుగనుక కొంచెంసేపు నేను వచ్చిన సంగతి రహస్యంగానే వుంచండి. అప్పుడు నేను తనబీదస్థితిలో దాని నడత యెట్లావుంటుందో స్వయంగా కనిపెట్టి, తరువాత మాతండ్రి యిచ్చిపోయిన యీభాగ్యమంతా దానితో నేను సుఖంగా అనుభవిస్తాను.

భీమ—మీతండ్రి మహావీరుడు. అతడూ నేనూ పటాలంలో కొంచెం కాలమే పనిచేసినా, మేము యిద్దరమూ ప్రాణస్నేహితులుగా వుండేవాళ్ళము.

వీర—నూతల్లిపోవడంచేత యింట్లో ఆడదక్షతలేక కూతురు పోయి విచారిస్తూవున్నావని నీకు పెంచుకోవడానికి యిచ్చిన కనకాంగిని

పెంచి పెద్దదాన్ని చేసినందుకు మాత్రండిపోయినా నాకు విశ్వాసం పోలేదు. నీవు బ్రతికినంతకాలమూ సుఖంగా జీవనంచెయ్యడానికి తగిన జీవనాధారం నేను యేర్పరుస్తాను.

భీమ—ఆమాటలు యిప్పుడేమీ నాతో చెప్పవద్దు. మన కనకాంగిని యివ్వదలచుకొన్న విశ్వకర్మను నీకు యిప్పుడు చూపిస్తాను. అతను భాగ్యవంతుడు కాకపోయినా మాటనిలకడ గలవాడున్నూ కష్టపడి వొళ్లుదాచుకోకుండా బాగా పాటుపడేవాడున్ను పెద్దమనిషిన్నీ అవును. వాళ్ళయిద్దరికీ వకరిమీద వకరికి మోహం విస్తారంగావున్నది గనుక వారి వివాహానికి నీవేమీ అడ్డంచెప్పవని తలుస్తాను.

వీర—నీవుచెప్పిన ఆమూడుగుణాలూవుంటే లోకంలో యింకా ధనంయేమికావలెను? అయినాకానీ నేను యీవూళ్ళోకి వచ్చిన సంగతీ కనకాంగికి ధనం తెచ్చిన సంగతీ విశ్వకర్మకుకూడా తెలయకుండా వుండ నియ్యండి. అతడికి నిజంగా కనకాంగిమీదప్రేమవున్నట్టునాకు కనపడ్డట్టయితే, యీపెళ్ళికి నేనేమీ అభ్యంతరంచెప్పను.

భీమ—(రహస్యముగా) అలాగైతే నీవు బీదవాడవనిన్నీ భుక్తికి జరగక యిక్కడకు వచ్చినావనిన్నీ వదంతి వేస్తాను. ఆపాకలో చాకలిది మనకేసిచూచి మనం యేమిచెప్పుకుంటామో అని ఆలకిస్తూవున్నది. దానికి తెలిస్తే వూరంతా తెలిసినట్టే. మంచిసమయం తటస్థమయింది. (బిగ్గరగా) అయ్యో! వీరభద్రా! నీవనుభవించిన కష్టాలూ నీ బీద తనమూ వింటే నాగుండెలు బద్దలవుతూవున్నవి.

సుబ్బ—(ఉలికిపడి) ఏమీ!

వీర—నేనేమీ అక్రమంచెయ్యలేదుగదా అన్న ధైర్యంతప్ప నావద్ద యీరాత్రి భోజనానికయినా చిల్లిగవ్వలేదు.

సుబ్బ—ఓయిదేవుడా! అంతా ఇంతేనా?

భీమ—మంచిది. నీవెంతమాత్రమూ అధైర్యపడబోకు. నీవు పడిదెకు తెచ్చుకుని వేసుకున్న యీబట్టలుచూస్తే యీవూళ్లో నిన్ను యెవళ్ళూ బీదవాడని అనుమానపడరులే. నిన్ను గోదావరివద్దు కారుఖానాలో పనికి పప్పగిస్తాను రా. (రహస్యముగా) తాలూకాకచేరీ అవైపుననే వున్నది. అక్కడ నీ నోట్లు మార్చుకొని మళ్ళీయిప్పుడే వత్తాము. (అని వెళ్ళుచున్నారు.)

సుబ్బ—(పాకలోనుండివచ్చి) ఇప్పుడు నేను వక కొత్తసంగతి కనిపెట్టినాను. అతనికి పూటకూటికి టికాణాలేదట. గర్భదరిద్రమట. కారుఖానా అని పేరుపెట్టుకుని వాళ్ళు వూళ్ళో ముష్టికిబయలుదేరినారు. సందేహంలేదు. లేకపోతే వకవేళ యెక్కడనయినా కన్నంవేసి పట్టుకుపోతారని యీవూరికి పారిపోయివచ్చినాడేమో సందేహంలేదు. అదేఅయివుంటుంది. నేను యిప్పుకు యెంతయినా చెప్పవలసివున్నది. వినేవాళ్ళు యిక్కడ వక్కరూ లేకుండావున్నారు. ఇప్పుడు వూళ్ళోకి పరుగెత్తుకునిపోయి పలుగురితోనూ చెప్పివత్తునా? వెళుదామంటే బట్టల దగ్గిర కనిపెట్టుకుని వుండేవారు యెవరూ కనపడరు. యిందులో చిలవలూ పలవలూ కల్పించి గంపెడుకబుర్లు చెపుతాను. యిక్కడ వుండడానికి యెవరినైనా పిలుచుకునివస్తాను. (అని వెళ్లుచున్నది.)

[చేతిర్రేలికి కట్టుకట్టుకొని చేబాడితపట్టుకొని విశ్వకర్మ ప్రవేశించు చున్నాఁడు.]

విశ్వ—(ముందుకువచ్చి) నాకు యిప్పుడు యేమీమతిలేదు. కుర్చీకాలు చెక్కపోయి పరధ్యానంచేత వేలు తెగగోసుకున్నాను. యిప్పుడు నాధ్యానమంతా కనకాంగిమీదవున్నది. తీరాసిద్ధమయిన పెళ్లి చెడగొట్టుకోవడంచేత నా సుఖంపోయింది; సంతోషంపోయింది; వుత్సాహంపోయింది. నా తెలివికూడా సెలవుపుచ్చుకుంటూ వున్నది.

[అప్పుడు సాధారణమయిన బట్టకట్టుకొని కనకాంగి ప్రవేశించుచున్నది.]

కన—(విశ్వకర్మనుజూచి) వి-వి-విశ్వకర్మా (ముందుగా నేను పలుకరించకూడదు.

విశ్వ—క-క-కనకాంగీ! (నేనుముందుగా పలుకరించరాదు.)

కన—నీవునన్ను పిలిచినావా?

విశ్వ—నీవేనన్ను పిలిచినాననుకున్నాను.

కన—నేను పిలువలేదు.

విశ్వ—నేనూపిలువలేదు. కనకాంగీ! నాకు యిప్పుడు నేత్రోత్సవంగా వున్నది.

కన—యేమిటీ!

విశ్వ—యేమిటా? నీవుయిప్పుడు కట్టుకున్నకోక బహుబాగా వున్నది.

కన—నిజంగా నేనా?

విశ్వ—నిజంగానే యిందాకటి పట్టుచీరకంటె ఫదిరెట్లుబాగా వున్నది. యిఖ మనవివాహం నిజంగా చెడిపోయినట్టేనా?

కన—(కన్నుల నీరుపెట్టుకొనుచు) ఏమిటీ! మనవివాహమా? అలాగే కనపడుతూవున్నది.

విశ్వ—(తనలో) నేను మళ్లీఅడిగితే, నేను తన డబ్బుకోసం పెళ్ళాడుతానంటూవున్నా ననుకుంటుందేమో! నేనేమిచెయ్యను?

కన—విశ్వకర్మా! నేను యిక్కడ నిలుచుని కళ్ళనీళ్ళు పెట్టుకుంటూవుంటే నీవు వూరికేచూస్తూ నిలుచున్నావుకాని నా దుఃఖం పోగొట్టడానికి కొంచెమయినా ప్రయత్నం చెయ్యడంలేదు గదా?

విశ్వ—(తనపై బట్టతో కన్నీరుతుడుచుచు) నాకు బహువ్యసనంగా వున్నది. నాకప్పుడు తెలియలేదు. నేను యిప్పుడు సిద్ధంగా వున్నాను.

కన—యెందుకు సిద్ధంగా వున్నావు?

విశ్వ—నీతో మళ్ళీయెప్పటిలాగు స్నేహం చెయ్యడానికి. నీకు అభ్యంతరం లేకపోతే నాకుయేమీ ఇభ్యంతరంలేదు.

కన—నీవు నిర్దయుడవు. నీకు నామీద నిజంగా ప్రేమవున్నట్టయితే ప్రొద్దున్న పట్టుచీరకోసం నాతో అలాపోట్లాడివుండవు. నేను యిప్పుడు యేమిచేసినానో చూచినావా? పట్టుచీరవిప్పి సాదాచీర కట్టుకున్నాను.

విశ్వ—నీకు నామీద దయవున్నది గనుక అలాచేసినావు. నీవు యిప్పుడు నీ మనసు వచ్చినచీరె కట్టుకోవచ్చును. మనం యిద్దరమూ యిప్పుడు మళ్ళీ స్నేహితులమయినామూ? అయినట్టే తోస్తూవున్నది. నీ మొఖానికి యిప్పుడు కళచేరుకున్నది. పెదవుల సందునుంచి చిరునవ్వు బయలుదేరుతూవున్నది. నీముఖవికాసంచూస్తే నాకుసంతోషంగావున్నది. నాకు పక్కముద్దుపెట్టు మళ్లీ స్నేహితులమవుదాము.

(అని కౌగిలించుకొని ముద్దు పెట్టుకొనుచున్నాడు.)

[అప్పుడు సుబ్బమ్మ ప్రవేశించుచున్నది.]

సుబ్బ—ఓరితుంటరీ! యిప్పుడుయేమి చేస్తువున్నావు?

విశ్వ—నీవుప్రొద్దున్న పెట్టిన కలహాన్ని చంపివేస్తూవున్నాను.

సుబ్బ—అయ్యో! యెంతదురదృష్టమూ.

విశ్వ—దురదృష్టమా?

కన—దురదృష్టమా?

సుబ్బ—దురదృష్టకంబెనూ హీనమయినది. వట్టిసిగ్గులచేటు. కనకాంగీ? నీఅన్న వచ్చినాడు చూచినావా?

కన—నాఅన్నా? నాకు అన్నే లేడు.

సుబ్బ—తప్పకుండావున్నాడు.

విశ్వ—ప్రియురాలా! నీవు యెరగనేయెరగవా! అతడు బహు ధనవంతుడు.

సుబ్బ—నీకు యీసంగతి తెలియనేలేదా? నీకు అన్నవున్నాడు అతను యీరోజున యిక్కడకు వచ్చినాడు. అతడు కటికిదరిద్రుడు. పూటకూటికి గతిలేదు. వట్టిబిచ్చగాడులాగు వున్నాడు.

విశ్వ—యెవరు?

సుబ్బ—కనకాంగితోడ బుట్టినవాడు.

విశ్వ—అతడు భాగ్యవంతుడనీ, గుర్రపుబండీవున్నదనీ, నవుకర్లు వున్నారనీ, మంచిబట్టలు కట్టుకున్నాడనీ, యింతకుముందేకాదా నాతో చెప్పినావు.

సుబ్బ—అది అరగంట సేపటికిందట. ఇప్పుడాగురుడు వెళ్ళిపోయినాడు. జనుల స్థితిగతులు నిముషంలో మారిపోతవి. అతగాడి వేషం మళ్ళీవచ్చేటప్పుడు చూస్తినిగదా ముష్టివాడివేషంకన్నను కనాకష్టంగావున్నది. నల్లగా మాసిపోయిన పాతచిరుగుల పీలికలగుడ్డ కట్టుకున్నాడు. కాలికి జోడులేదు—

విశ్వ—చాలుచాలును. ఈపాటివూరుకో. నీమాటలు నేను నమ్మను. మంచిజరీబట్టలు అరఘంటసేపటిలో మాసి చిరిగిపోయి పీలికలయినయ్యంటే యెవరైనా నవ్విపోతారు.

సుబ్బ—నేను నిజంచెప్పినాను. నామాటలు నమ్మితేనమ్ము నమ్మకపోతే నమ్మకు. (కనకాంగివంక(జూచి) నీఅన్నగారు నీవు

భీమయ్య కూతురవుకావని స్పష్టంగాచెప్పినాడు. అతడు యిప్పుడు నిన్ను తమవూరికి తీసుకుపోవడానికేవచ్చినాడు. దారిఖర్చునిమిత్తం కారుఖానాలో కూలిపనిచేసి సాయింత్రానికి పావలాడబ్బులు సంపాదించి వాటితో యీరాత్రి నిన్ను మోటబండిమీాదయెక్కించి తన వెంట తీసుకుపోతాడు. అతణ్ని యింతకుముందే కార్ఖానాలో వప్పగించడానికి భీమయ్య వెంటబెట్టుకొని వెళ్ళినాడు.

[అప్పుడు భీమయ్యాయు వీరభద్రుఁడును ప్రవేశించి వారికి కనఁబడకుండ వెనుక నిలుచున్నారు.]

విశ్వ—ఏమిటీ! అతడు కనకాంగిని తన వెంట తీసుకునిపోతాడా? ఈవిడెను తీసుకునిపోతే నన్నుకూడా తీసుకునిపోవలెను.

కన—సుబ్బమ్మా! నేను నీవుచెప్పినదానిలో వక్కమాటయినా నమ్మను. నీవు మాకు మళ్ళీపోట్లాటపెట్టవలెనని చూస్తూవున్నావు. నేను యిప్పుడు మాతండ్రి కూతురిని కాననడం నట్టి దూషణగా వున్నది. లోకంలో యింతకంటె విచిత్రంలేదు.

సుబ్బ—నీకు తండ్రియెవరో యెవరికితెలియదు. ఈవిశ్వకర్మ అభమూ శుభమూ యెరగని అమాయకుడుగనుక, నీవు యెవరికూతురవో తెలుసుకోకుండా చేతులో దమ్మిడీగవ్వలైనాలేని నిన్ను తగుదునని పెళ్ళాడడానికి తయారయినాడు. నీఅన్నగారిని చూడబోతే చిరుగుల గుడ్డలూ తానూ నీకంటెనూ గర్భదరిద్రుడుగా వున్నాడు.

విశ్వ—(దగ్గరగావచ్చి) సుబ్బమ్మా! నేను వక్కమాట చెపుతాను విను. కనకాంగికి తండ్రివున్నా లేకపోయినా, యీాచిన్నది బీదదైనా భాగ్యవంతురాలయినా, అన్నగారివి చిరుగులగుడ్డలయినా జరీబట్టలైనా, వాటితో నాకు యేమీాపనిలేదు. నాకుకనకాంగిమీాద మోహం వున్నది; నేను కనకాంగిని పెళ్ళాడుతాను. ఈవిడె అన్నగారికి బట్టలు

లేకపోతే నాబట్టలలో కొన్ని యిస్తాను; యిల్లులేకపోతే నాయింట్లోనే కాపురం వుండనిస్తాను; అన్నంలేకపోతే నేను మరింతకష్టపడి సంపాదించి పెడుతాను. నాకు వంట్లో సత్తువవుంటేనూ యీ రెండుచేతులూ చల్లగా వుంటేనూ, ఈవిడె అన్నగారువచ్చినా తండ్రివచ్చినా యేమేటా వొక్కొక్కడు చొప్పున పదిమందిపిల్లలు వచ్చినా వళ్లుదాచుకోకుండా పనిచేసి సంపాదించి అందరినీ పోషిస్తాను. ఇఖయిప్పుడేమి చెపుతావు?

వీర—(ముందుకువచ్చి విశ్వకర్మచేయిపట్టుకొని) నిన్నుచూస్తే నాకుబహు సంతోషంగా వున్నది. ఈకనకాంగి అన్నగారినినేనే. నేను నీవల్ల సహాయంపొందడానికి బదులుగా నాచెల్లెలినీ సంవత్సరానికి మూడువందలరూపాయలు వడ్డీవచ్చే సొమ్మూకూడా నీకే నేను యిస్తావున్నాను.

కన—మీరు నాకన్నగారవుతారా?

వీర—(కనకాంగి చేయిపట్టుకొని) చెల్లాయీ! నీవు సౌభాగ్యవతికమ్ము. నీకు నేను అన్నగారినంటే నీకు అద్భుతంగానే వుంటుంది. మనవంశకథ అంతా యీరాత్రి నీవివాహం అయినతరువాత రేపుసావకాశంగా నీతో చెపుతాను.

విశ్వ—సంవత్సరానికి మున్నూరురూపాయలా? మనం ఇఖ పెద్దకార్ఖానా పెట్టుకోవచ్చును.

సుబ్బ—అయ్యా! మీరు మహాదొడ్డవారని నేను యిదివరకే విశ్వకర్మగారితో చెప్పినాను. కావలిస్తే ఆయనను అడగండి.

బుచ్చమ్మ, శేషమ్మ, వెంకమ్మ, గ్రామస్థులు—(వెలుపలనుండి) సుబ్బమ్మ యెక్కడవున్నది? చాకలి సుబ్బిముండ యెక్కడవున్నది?

విశ్వ—సుబ్బమ్మా! నీకోసం యెవరో చాలామంది వస్తావున్నారు.

[అప్పుడు బుచ్చమ్మయు. శేషమ్మయు, వెంకమ్మయు,
గోపాలుఁడును, ప్రవేశించుచున్నారు.]

వెంక—(సుబ్బమ్మతో) ఓసీ చాకలితొత్తా! నేనుబట్టలువుతికే రామారావుపంతులుగారి భార్యవద్ద నావిషయమయి నీవుయేమని చెప్పినావు? మా మడివేలు పెళ్లిచేసుకున్న వాడుకాడు. వుంచుకున్న వాడని నీవు యెందుకు చేలినావు? ఇలాగంటి సంసారఘాతలు పలకడానికి నీకు నోరెట్లావచ్చిందే. మాపంతులుగారు నీకు 'కలహప్రియ' అనిపేరు పెట్టినందుకు వూరికేపోలేదు.

బుచ్చ—(సుబ్బమ్మనుజూచి) నేను చిన్నప్పుడు గోదావరినడ్డున కూలికి పేడతట్టలు మోసేదాన్నని అబద్ధాలమాటలు పూజారాయనతో యెందుకు చెప్పినావు?

శేష—(సుబ్బమ్మదగ్గరకుపోయి) నేను వెనుక యెవరియింట్లోనో యేదో యెత్తుకుపోయినానని, నేను పడుచుదాన్నిగా కనపడడానికి తలవెంట్రుకలకు రంగువేసుకుంటానని, బజారులో బట్టలదుకాణం వేసుకనే కోమటి మల్లయ్యతో యెందుకుచెప్పినావు?

సుబ్బ—నేను యెవరితోనూ యేమీ చెప్పలేదు.

వెంక—చెప్పినావు. (అని యొక లెంపకాయకొట్టుచున్నది.)

బుచ్చి—తప్పకుండా చెప్పినావు. అని వీపుమీద గ్రుద్దుచున్నది.)

శేష—నీవుచెప్పినందుకు యేమీసందేహంలేదు. (అని బుగ్గలు పొడుచుచున్నది.)

భీమ—నీవు యిలాగంటి తంపులు పెట్టకుండా వీళ్ళు నీకు బాగా బుద్ధిచెప్పినారు.

గోపా—ఆహాహాహా! దీనికి తగినశాస్తిఅయినది. యిది నా పెళ్ళానికీ యెవరికో రంకుకట్టిందట. నేనుకూడా ఆడదాన్ని యినట్టయితే దీన్ని నాలుగుతన్నులు తన్నుదును.

సుబ్బ—అందరూ కాట్లకుక్కలలాగు మీాదపడితే వంటరి కత్తెను యేమిచెయ్యగలను. ఇప్పుడు మీాకాలంవచ్చింది. నవ్వండి నవ్వండి. యేమిచేస్తాను? నేను రేపటినుంచి మీాతో యెవరితోనూ మాట్లాడను. నాతో నేనే మాట్లాడుకుంటాను. నాతో నేనే నవ్వుకుంటాను. (అని వెళ్ళుచున్నది.)

గోపా—హాహాహా!

విశ్వ—ఇప్పుడు కలహాలమారి సుబ్బమ్మ మనను విడిచిపెట్టి వెళ్ళిందిగనుక, యిక యీారోజు మనమంతా సంతోషంగా వుండవచ్చును. మనం లోకంలో స్నేహమున్ను గౌరవమున్ను సంపాదించుకోవలెనంటే యెవరివిషయంలోనూ జబ్బుమాటలు చెప్పకుండా వుండవలెను. మనం యెవరివిషయంలోనైనా మంచిమాటలు చెప్పకలేకపోతే మౌనంధరించి వూరికే వుండడంమంచిది. ప్రొద్దుపోయింది లోపలికి వెళుదాముదండి.

(అందఱును నిష్క్రమించుచున్నారు.)

మోడరన్ ప్రెస్, కలర్ ప్రింటర్స్ & బాక్సు మేకర్స్, రాజమండ్రి.

మహామహోపాధ్యాయ ప్రహసనము

గ్రంథకర్త:

కందుకూరి వీరేశలింగము పంతులు

★

ప్రకాశకులు:

హితకారిణీ సమాజము,

రాజమహేంద్రవరము

1950

[వెల రు 0-4-0

మహామహోపాధ్యాయ ప్రహసనము

— ఇందువచ్చు పాత్రములు —

కళావిదుఁడు—విద్యలయందాదరముగల యొకక్షత్రియుఁడు

ధీనిధి—కళావిదుని కుమారుఁడు

విద్యానాథుఁడు—ఒకయుపాధ్యాయుఁడు

భీముఁడు, మహామహోపాధ్యాయతర్కపంచాననుఁడు — ఒక శాస్త్రపండితుఁడు.

వసంతతిలక—కళావిదుని మేనకోడలు

చంద్రిక—వసంతతిలకదాసి

---

౧. రంగము—కళావిదుని తోటలోని యిల్లు.

[అప్పుడు చంద్రిక ప్రవేశించుచున్నది.]

చంద్రి—(చీపురుగట్ట చేతఁబట్టుకొని) నాకు పనిఅంటే బద్ధకం. యీపనిమానివేసి వీధివంకచూస్తూ మహారాణీలాగు కూర్చుంటే బాగావుండును. మేడగోడ తుడవబోతే కిందపడిపోయిందని యీ చీపురుగట్ట వీధిలో పడవేస్తునా? అదుగో యెవరో వస్తూవున్నారు. మరి యెవరూకాదు. వసంతతిలక.

[చప్పుడుకాకుండ మెల్లగానడుచుచు గృహములోనుండి వసంత తిలక ప్రవేశించుచున్నది.]

వసం—ఓసీచంద్రీ! మా మామగారు వీధిలోకి వెళ్ళినారా?

చంద్రి—యిప్పుడే వెళ్ళినారు. మీ మేనమామగారు యిప్పుడే కాదా గదిలో కూర్చుండి చదువుకోమని మిమ్మలిని లోపలికి పంపివేసి నారు. అమ్మా! మీరప్పుడే మళ్ళీ వచ్చినారేమి?

వసం—యెప్పుడూ అదేపనిగా కూర్చుని చదువుకోమంటే విసుగువస్తుంది. ఓసీ! నీతో చెప్పనా? నాకు కామబాధ మహావిస్తారంగా వున్నది. నాకుయిప్పుడు యేమి చెయ్యడానికీ తోచకుండా వున్నది.

చంద్రి—నాకూ అలాగేవున్నది.

వసం—చంద్రీ! నేను వెనుక యెప్పుడూ కామంచేత యింతబాధ యెరగను.

చంద్రి—అమ్మా! నాబాధ యెవరితో చెప్పుకోను? అవునుకాని మీ మేనమామగారు తనకుమారుడు ధీనిధిగారు చెన్నపట్నం కాలేజి నుంచి వచ్చినప్పటినుంచీ మిమ్మల్ని యిద్దరినీ వక్కచోట వుండకుండా చేస్తూవుంటారు. యెందుచేత? నేను చూస్తూవుంటాను. మీ మేనమామ గారికి మిమ్మలినీ ధీనిధిగారినీ కనిపెట్టి చూస్తూవుండడం తప్ప రెండో పని కనపడదు.

వసం—వూరికే అలాచూడడమే కాని, అందువల్ల యేమీ ప్రయోజనంలేదు. ధీనిధీ నేనూ కలుసుకోవలెనంటే ఆయనపట్టుకో గలడా?

[ధీనిధి ప్రవేశించుచున్నాడు.]

ధీని—వసంతతిలకా! ఇప్పుడు వచ్చింది మరియెవరూ కాదు. నేనే తొందర పడబోకు.

చంద్రి—మీరు యిద్దరూ వేరేవేరే గదులలో కూర్చుని వక్క మోస్తరుచదువే చదువుకుంటూ వున్నట్టున్నారు. ఇప్పుడు మీమీ చదువులు కూడా పలుకొక్కనడానికి వుభయులూకూడా యిక్కడికి వచ్చినట్టున్నారు.

దీని—అవును. అందుకే వచ్చినాము. మానాన్నగారు నన్ను వక్కసారిగా శేషాహి వాల్మీకిని కమ్మంటారు. నైషధమూ, మాఘమూ, భారవీ, యీలాగంటి గాళ్ళవంటి పాతపుస్తకాలు మరికొన్ని చదువుమని రాత్రీపగలూ పూరికే నాప్రాణాలు తీస్తూవున్నారు.

వసం—మీరుకాలేజీలో చాలాకాలం చదివినారు.

దీని—అవును. యఫ్ఫేక్లాసులో రెండేళ్ళూ బీయే క్లాసులో రెండేళ్ళూ నాలుగేళ్ళు చదివినాను. అక్కడవున్న కాలంలోకూడా నాకు నీచదువే విస్తారంగావుండేది. నీవు పెద్దదానవవుతూవున్నావనీ, నామీదనీకు ప్రేమహెచ్చుతూవున్నదనీ, నీవు మహాసౌందర్యవతివనీ, నాధ్యానమంతా నీమీదనే వుండేది.

వసం—అలాగయితే మీరక్కడ చాలామంచిచదువే చదివినారు. ఇకమీరు చదివింది చాలును.

చంద్రి—ఎక్కడ. ఈమధ్య మీనాన్నగారూ చదువుల పంతులు విద్యానాథుడుగారూ మాట్లాడుకోవడంలో యీకాలపు కుర్రవాళ్ళు అతివిస్తారంగా చదువుకుంటారని చెప్పుతున్నారు. అది నిజమేనా?

దీని—విస్తారంగానే చదువుతారు. అయినాకానీ పురుషుడు వకరిని కామించివున్నప్పుడు చదవడం బహుకష్టం.

చంద్రి—అలాగయితే పెళ్ళయినతరువాత చదువు సాగుతుందనుకుంటాను.

దీని—సాగుతుంది. అప్పుడు మేము యిద్దరమూ కలిసి చదువుకుంటాము. పాపం! యీచంద్రికకు యీకామువిషయంలో యేమీ అనుభవంలేదు.

చంద్రి—నాకూవున్నది. నేనూ వకరిని కామించే వున్నాను. పెద్దమనుష్యుల యిళ్ళల్లోపనిచేసే పడుచుతనంలోవున్న నావంటి బీద

వాళ్ళ నడతను ముఖ్యంగా చూస్తారు. అందుచేత నేను నిరుడు నా పెత్తల్లితోకూడా చెన్నపట్నం వెళ్ళినప్పుడు నేను యెవరిని పెళ్ళిచేసుకోవలెనో యేర్పరుచుకున్నాను. ఈ ఆరునెలలబట్టీ నాకు యేమీ పని తోచడంలేదు. ఈబట్ట రెండ్నునెలలకిందటనే కొనుక్కుపట్టినా యీకాస్త చిరుగూ కట్టుకోనయినా కట్టుకోలేదు.

వసం—(ముందుకువచ్చి) ఓసీ చంద్రీ! నీమొగుడి సంగతి నాతో కొంచెం చెప్పు. అతను పడుచువాడేనా? చక్కగావుంటాడా? ఇంత మర్యాదగలవాడేనా?

చంద్రి—అతడు మహాచక్కనివాడు. యెప్పుడూ పెద్దమనుష్యుల దగ్గిర వుంటాడు. అతనుయెప్పుడూ పెద్దఅంగరకా వేసుకుని జరీ నక్కీ చుట్టినపాగా పెట్టుకుంటాడు.

వసం—ఆనక్కీ మంచిజరీదేనా?

చంద్రి—మంచిజరీదే. నడుముకు కట్టుకునే పటకాకూడాజరీదే.

ధీని—ఇప్పుడు తెలిసింది. అలాగయితే అతనికి యెవరివద్దనో బంట్రోతుపని.

చంద్రి—అయితేయేమి? అతనియజమానుడూ పూర్వం బీదవాడుగానేవుండేవాడట. యజమాను డయినప్పుడు నవుకరుమాత్రం యెందుకు భాగ్యవంతుడు కాకూడదు? యీఆరునెలలబట్టీ నాకు అతని కబురే తెలియడంలేదు. విచారంచేతనాకు మతిలేకుండావున్నది.

ధీని—చంద్రీ! విచారించబోకు. మాకుపెళ్లి అయిన తరువాత అతను యెవరో కనుక్కుని తెప్పిస్తాములే. మాపెళ్ళివేగిరం కాకుండా వుండడానికి యేదో తంత్రం జరుగుతూవున్నది.

చంద్రి—అదివీాకు యెలాగు తెలిసింది?

ధీని—మీా చదువులపంతులూ మాతండ్రిగారూ కూర్చుని యేకాంతంగా యెప్పుడూ యేదో గుసగుసలాడుకుంటూవుంటారు.

చంద్రి—వారి యేకాంతంవల్ల యెవరికీ యేమీానష్టంరాదు.

వసం—మేము యీసాయంకాలం వుత్సవంలోకి వెళ్ళదలుచుకున్నామని వారికేమయినా అనుమానంకలిగిందా?

చంద్రి—కలిగినట్టులేదు. మీా మేనమామగారు నాలుగు గంటలకు బండీవాణ్ని బండీతోలుకుని రమ్మన్నారు. వారు మరియెక్కడికో వెళ్ళేటట్టువున్నారు.

ధీని—అలాగయితే మనం యీరోజున వారిని బుట్టలో వెయ్యవలెను. అదుగో మానాన్నగారు వస్తూవున్నారు. మీారు యిద్దరూ లోపలికి పరుగెత్తండి. నేను యీతోటలోకి వెళుతాను.

(వసంతతిలకయు, చంద్రికయు లోపలికి పోవుచున్నారు.)

ధీని—వీలయితే ఆయనకు కనపడకుండా నేను యీదారిని తోటలోకి వెళుతాను. అని మెల్లగా గోడదరినుండి ప్రాకిపోఁబోవుచున్నాఁడు.)

[అంతట కళావిదుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

కళా—పోకు పోకు. వుండు. ఇదేనా చదువుకోవడం? నీవు గదిలోకూర్చుని కావ్యాలు చదువుకుంటూ వున్నావనుకున్నాను. చదువుకోవడానికి బదులుగా తోట గుమ్మంవద్ద ముంగిలాగు పాకుతూ వున్నావా?

ధీని—చదువుకుంటూనే వున్నాను. వకచోట వకసుందరి యొక్కమంచి సౌందర్య వర్ణనకనపడితే దాన్నిచూచి ఆశ్చర్యపడుతూ వున్నాను.

కళా—అదియేదీచూతాము చెప్పూ.

ధీని—మీరు అథాత్తుగా రావడంతోటే పోయింది. కాస్త సేపు నేను ఆలోచించుకుంటూవుంటే మళ్ళీరావచ్చును.

కళా—నీవుచెప్పేది వట్టిఅసందర్భంగా వున్నది. నేను చిన్నప్పుడు నీలాగే చదువుకునేవాణ్నను కున్నావా యేమిటి? ప్రొద్దున్న లేస్తే రాత్రి పదిఘంట లయిందాకా వక్కమోస్తరున చదివేవాణ్ని. నేను సంస్కృతంమాత్రం చదవలేదు. నిన్ను సంస్కృతంలోకూడా పండితుణ్ని చెయ్యడానికి నిశ్చయించుకున్నాను.

ధీని—మీరుఅంత సేపూ చదివినదాని ఫలంయేమిటో నాకు కొంచెం చెపుతారా?

కళా—వోపిక పెట్టు దానిఫలం నీకు వేగిరమే తెలుస్తుంది. బహుశా యివాళే తెలియవచ్చును. ఆడుకో ఆడుకో. ఇంకా యెంత సేపు ఆడుకుంటావు? ఇప్పుడు నీమనసువచ్చిన చోటికి వెళ్ళవచ్చును.

ధీని—(తనలో) ఇవేళ యేదోవున్నది. ఇప్పుడు నేను వసంత తిలకవద్దకు వెళుతాను. (అని లోపలికి వెళ్ళుచున్నాఁడు.)

కళా—వీడన్నట్లు నాకు విద్యరానిలోపం బాగా కనపడుతూ వున్నది. వీణ్నయినా విద్యలో ఘట్టివాణ్ని చెయ్యవలెను. (అని నడుచుచున్నాఁడు.)

[అప్పుడు విద్యానాథుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

విద్యా—చంద్రికా! యెక్కడవున్నావు? ఓహోహో! కళావిదుడుగారు యిక్కడనే వున్నారా? మీరు యీదినం బహుసంతోషముగా వున్నట్టున్నారు.

కళా—విద్యానాథుడుగారా? రండి. ఇవేళ అప్పుడే బడివదలిపెట్టి వచ్చినారేమి?

విద్యా—యీరాత్రివ్రాళ్ళో ఉత్సవమని యిప్పుడే ఆటవిడుపు యిచ్చినాను. మొన్నటిదినం మనంమాట్లాడినసంగతి యేమి ఆలోచించినారు?

కళా—మీరు చెప్పినట్లే చెయ్యడానికి నిశ్చయించినాను.

విద్యా—మంచిపనిచేసినారు. చిన్నవాళ్ళకు మంచిశిక్షవుండవలెను. బాగాశిక్షిస్తేనేకాని పిల్లలు యెప్పుడూ లొంగరు. నాబళ్ళో చదువుకునే పిల్లవాళ్ళను నేను వక్కొక్కణ్ని రోజుకుడజన్ దెబ్బలయినా కొట్టకుండా విడిచిపెట్టను. అందుచేత వాళ్ళకు యెంతవిధేయత? యెంతభయము? యెంతసద్వర్తన? నాశిక్షలో వుంచడానికి మీకుమారుడు యిప్పుడు పెద్దవాడై పోయినాడేమో? ఇప్పుడు స్కూళ్ళలో చదువుకునేవాళ్ళకు బొత్తిగా వినయవిధేయతలూ, పిన్నపెద్ద తారతమ్యాలూ యేమీలేవు.

కళా—మీరు చెప్పినమాట సత్యము.

విద్యా—అలాగయితే మీ అబ్బాయికి సదాయింట్లోవుండి వినయ విధేయతలు నేర్పేగురువు వుండవలెను.

కళా—అటువంటివాడే వుండవలెను.

విద్యా—బాగా ఆలోచించినారు. (తనలో) నేనయితే యిల్లు విడువకుండావుండి రెండుపూటలూ భోజనం చేస్తూవుందును.

కళా—తెలివయినవాడు తక్కువజీతానికిరాడు. మాయింట్లో భోజనంపెట్టి ఆరునెలలవరకూ నెలకు యాభయ్యేసిరూపాయల చొప్పున జీతం యివ్వడానికి నిశ్చయించినాను.

విద్యా—(తనలో) నేనేయీపనికి తప్పకుండా తగినవాణ్ని, (బిగ్గరగా) నెలకు యాభయిరూపాయలా? జీతం బాగానేవున్నది.

కళా—నేను యేర్పరిచిన ఆయన బహుసమర్థుడు. ఆయన యీ రోజున యిక్కడకు వస్తాడు.

విద్యా—(సంతోషముతో) ఆయన యిఖను వస్తాడా? యిదివరకే యిక్కడికి వచ్చివుండలేదా?

కళా—యిదివరకే వచ్చివున్నాడా? (అని తొందరపడి చూచుచున్నా(డు.)

విద్యా—మీరు చూడలేదా? (అని తాను ముందుకువచ్చి నిలుచున్నా(డు.)

కళా—మంచి వుపాధ్యాయుడి నిమిత్తమయి మీరు యెప్పుడు నాతోచెప్పినారో అప్పుడే పనిచేసినాను. మాఅబ్బాయి విషయంలో యీవుపకారమంతా మీరుచేసిందే. మీమేలు నేను యెప్పుడూ మరిచిపోను. లోపలికి వెళ్లవలెను. సెలవుపుచ్చుకుంటాను. (అని వెళ్ళుచున్నా(డు.)

విద్యా—అయ్యో! వక్కమాట. అప్పుడే వెళ్ళిపోయినాడు! సమయంవచ్చి నప్పుడు పనినాకు యివ్వకుండా మరివకడికి వేసినతరువాత నామేలు మరిచిపోయినా మరిచిపోకపోయినా వకటే. యిప్పుడు నన్ను మరిచిపోయినారు గద.

[లోపలనుండివచ్చి చంద్రిక ప్రవేశించుచున్నది.]

చంద్రి—అయ్యో! యేమిటి ఆలోచిస్తూ వున్నారు?

విద్యా—యింట్లోనే బస.

చంద్రి—యేమిటి?

విద్యా—రెండుమాట్లు పంక్తిని భోజనము. పయిగా నెలకు యాభయి రూపాయలు.

చంద్రి—యేమిటి?

విద్యా—ఇవన్నీ పోయినవి. మాబళ్ళోపిల్లలు యిచ్చేజీతాలన్నీ పోగుచేసినా నెలకు నాలుగయిదు రూపాయలకంటె యెక్కువ రావు. యిప్పుడు వెళ్ళి నాబళ్ళోపిల్లలినందరినీ బాదివదిలిపెడుతాను. ఇంతమంది పిల్లలుయెందుకు? ధీనిధి వంటివాడు వక్కడువుంటేచాలును.

చంద్రి—ధీనిధా?

విద్యా—ధీనిధి కాకపోతే ధీనిధితండ్రి. యెవరోవకరు. ఈ ముసలాయన తగినవాణ్ని నేను యిక్కడవుండగా నామాట మరిచిపోయి తనకొడుక్కు గురువుగావుండడానికి యెవడో బుద్ధిహీనుడికోసం చెన్నపట్నం వ్రాసినాడట. ఆవచ్చేవాడు యెవడో వేదజడుడయిన శుద్ధశ్రోత్రియుడయి వుంటాడు.

చంద్రి—అయ్యో! పాపం! ప్రాణస్నేహితుడవు నీమాటే మరిచిపోయినాడా?

విద్యా—అయితే పెరటిచెట్టు యెప్పుడూ మందుకురాదు. దూరపుకొండలునునుపు. మనం అందరమూచేం యిందులో వక వుపాయం చెయ్యవలెను. చంద్రికా! నీకు నేను పనివేయించినందుకు నీవు నాకు సహాయంచెయ్యవలెను. ఆవచ్చే వుపాధ్యాయుడిమీద మనం అందరమూ అబద్ధాలు కల్పించిచెప్పి యీయింట్లో నిలువలేకుండా మూడు దినాలలో తోక తెంచుకొని పారిపోయేటట్టు చెయ్యవలెను. మీసవుకర్లందరూచేరి అతణ్ని నిత్యమూ యేడిపించవలెను. నేను వెళుతాను. అతనురావడంతోటే నాకు కబురుచెప్పు. (అని వెళ్ళుచున్నాడు.)

చంద్రి—ధీనిధి విషయంలోచేసిన కుట్రాలోచనంతా యిదా? నేను యిప్పుడేపోయి ఈసంగతి ఆయనతో చెపుతాను. యెవరో మాట్లాడుతూవస్తూవున్నారు. (అని చూచుచున్నది.)

[మహామహోపాధ్యాయ తర్కపంచాననుఁడనని భీముఁడు ప్రవేశించుచున్నాఁడు.]

భీము—మీా వుత్తరంప్రకారంగా నేను యిప్పుడే వచ్చినాను. నాతో పెట్టెలూ సామానూ యేమీాతీసుకునిరాలేదు. యీచిన్న మూటమాత్రం వకటి తెచ్చినాను. నేను ప్రయాణంచేసేటప్పుడు యెప్పుడూ సామానంతా యింటికాడనే దిగవిడిచి వస్తాను. నేను వచ్చినసంగతి కళావిదుడుగారితో చెప్పడానికి యిక్కడ యెవరూలేరా?

చంద్రి—(ముందుకువచ్చి) మీారు యెవరు?

భీము—(చంద్రికవంక తిన్నగాచూడక) ఓచిన్నదానా! నీవు పరుగెత్తుకునిపోయి యీవేళవస్తారని యెదురుచూస్తూవున్న పండితుడు గుర్రపుబండీయెక్కివచ్చి యిప్పుడే మీాగుమ్మమువద్ద దిగినారని కళావిదుడిగారితో చెప్పు. వేగిరంవెళ్ళు.

చంద్రి—ఆయననే యీాయన కాబోలును. అక్కడక్కడ మనిషినిపోలిన మనిషివుంటూవుంటాడు. (అని వెనుకతిరిగి చూచుచు మెల్లగా వెళ్ళుచున్న.)

భీము—ఈమనిషి నా కేసి యెలా తేరిపారచూస్తూవున్నదో. ఇది నన్ను దెయ్యమనుకున్నదో భూతమనుకున్నదో! ఇక్కడ నన్ను యెవరైనా ఆనవాలు పడుతారేమో! నేను మా వుపాధ్యాయులుగారివేషం బాగా వేసినాను. ఆయన యిక్కడ యీాయనకొడుక్కి వుపాధ్యాయులుగా వస్తానని వప్పుకున్నప్పటికీ యీామధ్య జ్వరంరావడంచేత రాలేనని వుత్తరంవ్రాసి టపాలోవెయ్యమని నాచేతికియిచ్చినారు. ఆవుత్తరం నేను టపాలో వెయ్యకుండా యీాచొక్కాజేబులో వేసుకున్నాను. దుమ్ముదులిపించి తెస్తానని ఆయన పాతశాలూ పుచ్చుకొని చాకలి

దాని యింటికివెళ్ళి ఆయన బట్టలుపుచ్చుకుని యీవేషంవేసినాను. నేను అద్దంలో చూచుకుంటే అచ్చంగా సంస్కృత శాస్త్ర్లగారులాగే వున్నాను. నేను సరిగ్గా మహామహోపాధ్యాయ తర్కపంచాననుల వారిలాగు వుండడానికి సందేహంలేదు. భోజనంకాకుండా నెలకు యాభయిరూపాయలు వస్తవి. నక్క నెలవచ్చినా వచ్చినవే. యెందుకు పోగొట్టుకోవలెను? మావాళ్ళను చూచిరావడానికి నేను మా శాస్త్ర్లగారివద్ద నెల్లాళ్ళు సెలవుపుచ్చుకున్నాను. యిఖ చదువుమాట విచారించవలెను. మాశాస్త్ర్లగారు పండితులతో ప్రసంగాలు చేస్తూవుంటే చాలాకాలంనుంచి వింటూ వుండడంచేత నాలుగు సంస్కృత ముక్కలు పట్టుకున్నాను. అవి కొన్నాళ్ళు చాలును ఆచిన్నవాడికి నాస్వభావ బాగానేర్పుతాను. అదుగో ఆయన వస్తూవున్నారు.

[అప్పుడు లోపలినుండి కళావిదుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

కళా—(ముందుకువచ్చి నమస్కారముచేసి) స్వామీ! మీ దర్శనంకావడం నేడు సుదినం. మాగృహం పావనమయింది. మహామహోపాధ్యాయ తర్కపంచాననులవారంటే లోకప్రసిద్ధిగావున్నది. అటువంటి లౌకికపండితులు నాకుమారుడికి గురువులు కావడంకంటె యెక్కువ అదృష్టం యేమివుంటుంది?

భీము—మీరువూరికే నన్ను ముఖస్తుతిచేస్తూవున్నారు. తమవంటి సుజనుల్ని చూడడంచేత నాకు బహుసంతోషంగావున్నది.

కళా—మీరు మహావినయ సంపన్నులు. మిమ్మల్ని మీ యెదుట స్తుతిచెయ్యడం మీకు యిష్టంలేదు.

భీము—యెంతమాత్రమూ యిష్టంలేదు. మీరు నిజం కనిపెట్టినారు.

కళా—నేను చదువుకున్న వాణ్ని కాకపోయినా నాకు విద్య అంటే మహాఅభిలాష.

భీము—మీావిద్యాసక్తిఅంతా నావంటిపండితుల్ని పిలిపించడం లోనే తెలుస్తూవున్నది. నాచిన్నశిష్యుడు యెక్కడవున్నాడు? నాకు తెలిసిందంతా ఆబాలుడికి మర్మం విడిచి చెప్పుతాను నేను చెప్పినట్టు విని నేర్చుకుంటే నేర్చుకోవడానికి యెంతో కాలంపట్టదు.

కళా—మీారు అతణ్ని పసిపిల్లవాడనుకుంటూ వున్నారు. అంత పసివాడుకాడు. అతనికి యిరువయివొక్క—

భీము—యిరువయిపకటా? (తనలో) యిరువయివొక్క మాసం కాబోలును.

కళా- అతను యిదివరకే కొంతచదువు కున్నాడు.

భీము—అలాగా? నేను అతడు పసిపిల్లవాడనుకున్నాను.

కళా—కాదుకాదు. అతను యీాయేడే యింగ్లీషులో బియేపరీక్ష ప్యాసు అయినాడు సంస్కృతంకూడా చాలావచ్చును.

భీము—అలాగైతే నేను అతగాడి నిషయమై విశేషప్రయాస పడవలసినపని లేదు.

కళా—అవనికి కొంచెము వ్యాకరణమూ, తర్కమూ, అలంకార శాస్త్రమూా కూడా తెలుసును.

భీము—అంతా యిదివరకే తెలిస్తే నేను యిప్పుడు కొత్తగా చెప్పేదియేమున్నది?

కళా—మీారు అతనికి శాస్త్రాలలో మెరుగులు చెప్పవలెను. ముఖ్యంగా సత్ప్రవర్తన నేర్పవలెను.

భీము—ఓహోహో! మెరుగులా? యిప్పుడు బోధపడ్డది. అవి వక్కనిమిషంలో నేర్పుతాను. (తనలో) చెప్పుల జోళ్ళకు మెరుగు పెట్ట

డమూ, వెండిబంగారపు వస్తువులకు మెరుగుపెట్టడమూ, అద్దాలకు మెరుగుపెట్టడమూ, అన్నీ నేర్పుతాను.

కళా—అతనికి వినయవిధేయతలూ మర్యాదలూ అన్నీ నేర్ప వలెను. ఇంగ్లీషు చదువుకోవడంచేత వచ్చిన అవిధేయత ముఖ్యంగా పోగొట్టవలెను. తమకు విశదమయిందా?

భీము—అంతా తెలిసింది. ఇకమీరునాకు వేరేచెప్ప నక్కర లేదు. నేను అతనికి నవుకర్లతో కలసి మెలసివుండకుండా వుండడమూ వాళ్ళమీద కోపపడకుండా వుండడమూ, వాళ్ళకుతేనిపోని పనులు చెప్పకుండావుండడమూ, మొదలైన గృహనీతులుకూడా బోధచేస్తాను

కళా—అవీచెప్పవలసినవేకాని, అవిఅంత ముఖ్యమైనవికావు.

భీము—కావు. ఆసంగతి నాకూ తెలుసును. అయినాకానీచిన్న వని వాటినీ అలక్ష్యం చేయరాదు. నేను చెప్పవలసినవి లక్షవున్నవి. అందులో మిక్కిలి స్వల్పమయినవి ముందుగా చెప్పినాను. నాచెప్పే మోస్తరంతా మీరే చిత్తగిస్తారు.

కళా—సమస్తమూ తెలిసిన మీతో నేను మనవిచెయ్యవలసి నది యేమీలేదు. అయినాకానీ నక్కమాట మీచెవిని వెయ్యవలసి వున్నది. అతనికి నామేనకోడలయిన వసంతతిలకమీద మోహం విస్తారంగావున్నది. దాన్ని యితనికిచ్చి వివాహంచెయ్యవలెననే, ఆచిన్నదాన్ని నేను చిన్నప్పటినుంచీ తెచ్చి యింట్లోవుంచుకుని విద్యా బుద్ధులు చెప్పిస్తూవున్నాను. అది యిప్పుడు యౌవనవతియై వున్నది. వాళ్ళయిద్దరికీ వివాహం చెయ్యతలచుకున్నాను. కాని యిప్పుడేకాదు. నాభావం తమరు గ్రహించినారా?

భీము—గ్రహించినాను. మెరుగులన్నీ గ్రహించినదాకా పెళ్ళి చెయ్యదలచుకోలేదు.

కళా—(తనలో) తుదకు మంచివుపాధ్యాయుడు దొరికినాడు. (బిగ్గరగా) తమపడకకూ సామానులకూ గదులుచూపిస్తాను. ఈవూళ్లో మీతో ప్రసంగానికి విద్యానాథుడని వక వుపాధ్యాయుడువున్నాడు. ఆయన పాండిత్యానికి మీతోసమానుడు కాకపోయినా, చిన్నతనంలో చాలా సంస్కృతం చదువుకొన్నవాడే. ఆయనను పిలిపించి మీదర్శనం చేయిస్తాను. (అని లోపలికి వెళ్ళుచున్నాఁడు.)

భీము—(తనలో) యీయింట్లో నేను యెలాగు నెగ్గుకువస్తానో!

కళా—ఎవడురా నవుకర్లు!

భీము—అయ్యో! వచ్చెవచ్చె. (అని పరుగెత్తుచున్నాఁడు.)

కళా—(ఆశ్చర్యముతో) ఇదేమిటి?

భీము—నాతాత్పర్యం మీనవుకరువచ్చెనని. (తనలో) అయ్యో! అప్పుడే తంటాలువస్తూవున్నది. ఇఖ జాగ్రతగా వుంటాను.

[తాళముచెవులు తీసికొని చంద్రిక ప్రవేశించుచున్నది.]

కళా—చంద్రీ! నీవువెళ్ళి యీయనకొగది చూపించు. అయ్యో! నేను యిప్పుడే మీశిష్యుణ్ని పంపుతాను. (అని వెళ్ళుచున్నాఁడు.)

చంద్రి—ఇతడతడయినందుకు యెంతమాత్రమూ సందేహము లేదు. (ఇద్దఱును గదిలోనికి వెళ్ళుచున్నారు.)

---

౨. రంగము—చదువుకొనుగది.

[మహామహోపాధ్యాయ తర్కపంచాననుని వెంటఁబెట్టుకొని చంద్రిక ప్రవేశించుచున్నది.]

చంద్రి—ఇది మార్గము. ఇలారండి. ఆయనలోపల వున్నారు.

భీము—(తనలో) ఈవిద్యానాథుడు నన్ను వూరికే బాధ పెడుతూవున్నాడు. అయినా కానీ నాసుద్యార్థితండ్రి ముసలాయన వెఱ్రిబాగులవాడులాగు కనపడుతూవున్నాడు. కాబట్టి నేను వీరియింట్లో సుఖంగాతింటూ జీతంపుచ్చుకుని పనిలేకుండా వూరికే కూర్చో వచ్చును.

చంద్రి—ఇఖ నేను మనసు పట్టలేకుండావున్నాను—ఓయీ! భీమా!

భీము—ఆ పిలిచింది యెవరు? అయ్యో! నాకిప్పుడు మతిపోతూ వున్నది.

చంద్రి—అవును అతడే.

భీము—(చంద్రిక వంకచూచుచు తనలో) ఓహోహో! నే నప్పుడు పెళ్ళిచేసుకుంటానన్న చిన్నది యిక్కడికి వచ్చింది? నేను నేను కానని దీనిదగ్గిర ప్రమాణాలు చేస్తాను. (బిగ్గరగా) అమ్మా! నీవు చాలా శ్రమపడి నన్ను యిక్కడకు తీసుకునివచ్చినావు.

చంద్రి—దున్నపోతా! నన్ను యెరగనట్టు నటిస్తావేమి?

భీము—(తనలో) ఇదెక్కడి గ్రహచారం! నేను యీభూమి మీద అసలేపుట్టకపోతే బాగా వుండిపోను. ఎరక్కపోయి పుట్టినాను. (బిగ్గరగా) నీతోడు! నిన్ను నేను నిజంగానే యెరగను. దీనిముఖం ఎలా వెలవెలపోతూ వున్నదో!

చంద్రి—(ఏడ్చుచు) నీమాటలవల్ల నాకడుపు పగిలిపోతూ వున్నది.

భీము—ఇది యేడవడానికి మొదలు పెట్టింది. ఇఖ వూరుకునే టట్టులేదు. ప్రియురాలా! కాదుకాదు. అమ్మా! నీవునీవేకాని నేను అతణ్ని కాను. నీవునన్ను చూచి నిన్ను మోసంచేసిన నిర్భాగ్యుడని

భ్రిమపడుతూవున్నావు. (తనలో) అయ్యో! నాకు చావువ్రాసింది. మగవాళ్ళ నాశనానికి యెక్కడా ఆడవాళ్ళు కారణం.

చంద్రి—(ఏడ్చుచు) నేను నీదుర్మార్గంఅంతా బయట పెడుతానువుండు.

భీము—అలాచేస్తే మనం యిద్దరమూకూడా చెడిపోతాము. నీముందులాభం చూచుకో. నేను నీ ప్రియుణ్ని భీముణ్నిసుమా. ఇప్పుడుమాత్రం మహామహోపాధ్యాయుణ్నయి వున్నాను.

చంద్రి—ఎవడవైనా నన్ను వదిలిపెట్టకూడదు. (అని యేడ్చుచున్నది.)

భీము—కళ్ళనీళ్ళు తుడుచుకో. నేను యెప్పుడూ నీదాసుణ్నే. (అని కాళ్ళమీద పడుచున్నాఁడు.)

[ఇంతలో కళావిదుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

భీము—ఓయి దేవుడా! ఇఖనాకు బ్రతికే యోగంలేదు.

చంద్రి—అయ్యో! (అని తాళము చెవులాతనిముందు పడవేసి లోపలికి పరుగెత్తుచున్నది.)

కళా—(ఉలికిపడి వెనుకకు రెండడుగులునడిచి) ఏమియీవింత ఇప్పుడు నాకళ్ళపడ్డది యేమయివుంటుంది?

భీము—అయ్యా! ప్రమాణపూర్వకంగా చెపుతాను. నేనుకాళ్ల మీద-కాదు-నేను మోకారించుకుని కూర్చున్నానని మీరు భ్రమపడ్డట్టున్నారు. అది వట్టిభ్రమేకాని యెంతమాత్రమూ సత్యంకాదు. నేను కాస్తయినా మోకారించుకోని కూర్చోలేదు.

కళా—ఓపండిత సార్వభౌమా! మీరింకా అలాగే కూర్చున్నారే.

భీము—(తాళముచెవులు చేతఁబట్టుకొని) ఇది మోకారించుకుని కూర్చోవడంలాగు పయికి కనపడుతుందికాని నిజంగా మోకారించుకోవడంకాదు. (లేచి) ఆ చిన్నది యిక్కడతాళం చెవులు పారవేసి పోయింది. నేను భరతశాస్త్రప్రకారంగా వాటిని తీసుకుంటూవున్నాను అంతేకాని మరియేమీకాదు.

కళా—కాదు కాదు. మహామహోపాధ్యాయులవారు శృంగారనాయకులుగా కనపడుతూవున్నారు. పండితులెప్పుడూ మహారసికులుకదా.

భీము—అదికాదు. ఇదికేవలనమ్రత వినయం పండితలక్షణము.

కళా—ఇదియేదో అపూర్వపండితలక్షణం కాని సామాన్యమయిందికాదు.

భీము—(గంభీరముగా) ఇప్పుడు నాకంటె మీరే గొప్పపండితులయినట్టు నటిస్తూవున్నారు. నాకంటెనూ మీకుయెక్కువ తెలుసునని గర్వంవున్నదాయేమిటి?

కళా—నాకుఅటువంటి గర్వంలేదు.

భీము—ఇప్పుడునాకు సంతోషంగావున్నది. నాకంటె మీకే యెక్కువపాండిత్యం వున్నట్టు లోపలమీకు వూహావున్నట్టయితేమీరు యిచ్చే యాభయిరూపాయలూ నేనే మీకుయిచ్చి మీచేత నాపిల్లలకు నేనే చదువు చెప్పించవలసి వుంటుంది.

కళా—మీరు చెప్పిందిసత్యం. ఇఖ ఆసంగతి పోనియ్యండి. మా అబ్బాయిని మీకు వప్పగింత పెట్టడానికి వచ్చినాను. అదుగో మాధీనిధిన్నీ విద్యానాధుడుగారున్ను వస్తూవున్నారు.

[విద్యానాధుఁడును, ధీనిధియు, ప్రవేశించుచున్నాఁరు.]

భీము—వారు రానడం నాకు సంతోషంగావున్నది.

కళా—ఓవిద్యానాధా! మహామహోపాధ్యాయులవారు వీరే.

భీము—(విద్యానాథునితో) మీదర్శనం లభించడంవల్ల నేడు సుదినం.

విద్యా—అది నేననవలసినమాట. (అని అసూయతో మొగము త్రిప్పుకొనుచున్నాఁడు.)

కళా—స్వామీ! వీడే నాకుమారుఁడు.

భీము—ఇతడు బహుచిన్నవాడు.

ధీని—(తనలో) అవును. చంద్రిక చెప్పినది నిజమే.

విద్యా—(తనలో) ఇప్పు డేలాగైనా యీపండితుడిగర్వం అణచవలెను. (భీమునివద్దకు వెళ్ళి) అయ్యా! మీరువుపదేశించే విద్య యొక్క పథకంనాకు కొంచెం సెలవిస్తారా?

భీము—కొంచెం యేమిటి? అంతా సెలవిస్తాను. మాది పాత పతకం.

కళా—అబ్బాయీ! విను. ఈపండితుల ప్రసంగం వింటే నీకు చాలాసంగతులు బోధపడతవి.

విద్యా—మీది పాతపతకమా? అందులో మీరు నవద్వీపం లో చెప్పేపద్ధతిప్రకారం బోధచేస్తారనుకుంటాను.

భీము—(తనలో) నవద్వీపంయేమిటో నాకు తెలియకుండా వున్నది. అదియేదో లంక. (బిగ్గరగా) నాది నవద్వీపంలో చెప్పేపద్ధతి కాదు దశద్వీపంలో చెప్పేపద్ధతీకాదు. నాది లక్షద్వీపంలో చెప్పే పద్ధతి. తెలిసిందా?

విద్యా—(తనలో) ఇతనిమాటలు నాకుతిన్నగా బోధపడడం లేదు. ఇతణ్ణి మరిఒక ప్రశ్న అడిగిచూస్తాను. (బిగ్గరగా) మీరు చెప్పింది తెలిసింది. మీది కాశీలోచెప్పేపద్ధతి ప్రకారంగా వుంటుంది కాదా?

భీము—కాశీలోనా? నేను యిప్పుడూ కాశీవెళ్ళలేదు. నాకది తెలియదు. నేను చాలాకాలం కంచి దగ్గిరవున్నాను. కంచిలో చెప్పే పద్ధతి నాకు బాగా తెలుసును.

విద్యా—(తనలో) యితడుచూస్తే వట్టిమూఢుడులాగు కన పడుతూ వున్నాడు. ఇతణ్ని వోడగొట్టివేస్తాను. (బిగ్గరగా) మీకు మీమాంసలో బాగా ప్రవేశం వున్నదిగదా?

భీము—మీమాంసంలేదు. మామాంసంలేదు. ఏదయినామంచి ప్రశ్న వెయ్యండి. పండితులతో చేసేప్రసంగం యిలాగంటిదేనా? అడిగితే తర్కంలో అడగండి; వ్యాకరణంలో అడగండి, యింకా యేదయినా శాస్త్రంలో అడగండి. వూరూపేరూలేని మీమాంసం యేమిటయ్యా? నేను యెప్పుడూ మాంసంజోలికిపోను. అది శూద్రయిళ్ళల్లో వుండే నవుకర్లపనికాని నాపనికాదు.

విద్యా—(తనలో) ఇతడు మహాశాస్త్రవేత్తలాగున నే వున్నాడు (బిగ్గరగా) ఏమిటీయిప్పుడు సెలవిచ్చినారు? మీమాంస శాస్త్రంకాదా?

భీము—చాలును. యీపాటివూరకోండి. నేను మీతో యెంత మాత్రమూ యేకీభవించను. మీపాండిత్యంవేరు. మాపాండిత్యంవేరు. వకరిదివకరికి సరిపడదు.

విద్యా—అవును సరిపడను.

భీము—ఎలాసరిపడుతుంది? పండితుడికీ పండితుడికీ కలుస్తుంది కాని మిడిమిడి జ్ఞానంగలవాడితో యెలాకలుస్తుంది?

విద్యా—మీశక్తినాకు తెలిసిపోయింది. మిమ్మలిని నేను నిముషంలో వోడగొట్టగలను.

భీము—నీవుయెప్పుడో వోడగొట్టగలనంటూ వున్నావుగాని నేను నిన్ను యిప్పుడే వోడగొడుతానుచూడు. ఇదుగో కాసుకోనా దెబ్బ. (అని పిడికిలిపట్టి చేయెత్తి విద్యానాథునిమీదికి లేచుచున్నాడు.

కళా—(లేచి విద్యానాథు నావలికిత్రోచి) మీరు యిప్పుడు వెళ్ళండి.

విద్యా—(కోపముతో తలయూచుచు) చిత్తము. (అనిపోవు చున్నాఁడు.)

భీము—(బిగ్గరగా నవ్వుచు) ఫో-ఫో-నీవూ నీమాంసం కూడా విరగడయిపోండి- ఈచదువులపంతులు వట్టి తెలివిమాలినవాడని మీ కందరికీ నిముషంలో తెలిసేటట్టు చేసినానా? అతడు తిన్నగా వాదం చెయ్యలేక తనచేతకానితనం కప్పిపుచ్చడానికి కోపం తెచ్చుకున్నాడు. లోపలసారంలేని అల్పజ్ఞానులు చేసేమూరోపాయాలు యిలాగంటివే.

కళా—మీరు చెప్పింది సత్యము. అతణ్ని ఓడగొట్టగల సామర్థ్యం మీదగ్గిరవున్నదని నాకు యిదివరకే తెలుసును. అయినాకానీ యిప్పుడాయన శాంతమంతా పోయింది. నేనువెళ్ళి ఆయనను సముదాంచివస్తాను. ఈలోపుగామీరూ మీశిష్యుడూ వకరిసంగతి వకరు మాట్లాడుకుంటూవుండండి. (అనివెళ్ళుచున్నాఁడు.)

ధీని—శిష్యుడికి గురువుగారి సంగతి యిదివరకే బాగా తెలుసును.

భీము—ఈరోజున పరాభవం యేమీలేకుండా నాకు జయం కలిగింది. దేవుడు నాకు గొప్పగొంతుక యిచ్చినాడు.

ధీని—వదీసత్తువకొద్దీ వక్కమాటు అరువు. ఎంతగొంతుక యిచ్చినాడో చూతాము.

భీము—అరవనా? అబ్బాయీ! నీవు నమ్రతా పెద్దలయెడల గౌరవమూ నేర్చుకోవలెను. గురువుల విషయంలో అలా యేకవచన ప్రయోగం చెయ్యవచ్చునా?

ధీని—నీగురుత్వం యేడిసినట్లేవున్నది వూరుకో. నీసంగతంతా నాకు చంద్రిక చెప్పింది.

భీము—అటువంటిదానిమాటలు వింటే అది యింకా యేమ యినా చెపుతుంది.

ధీని—చాలునులే యీపాటినోరుమూసుకో. నీవు భీముడవన్న సంగతి నేను స్వయంగానే యెరుగుదును. నిరుడు సంకురాత్రినాడు చెన్నపట్నంలో మేమంతా నాయుడుగారిమేడమీద సంగీతంపాడించి నప్పుడు నీవక్కడ ఫిడేలువాయించలేదా?

భీము—ఓస్సి! ఇక్కడ నన్ను అందరూ యెరుగుదురూ! మీరు యిప్పుడు నన్ను కనుక్కున్నారుగనుక నేను యిఖ కపటంవిడిచి నిజం చెపుతాను వినండి. నేను భీముణ్నే.

ధీని—నీవు యెంత్రమాత్రమూ భయంలేకండా యీవేషం వెయ్యడానికి యెలాగుసాహసించినావు?

భీము—ఇదియేమివేషం? పూర్వంనేను సాహసంచేసి తహశ్శీలు దారు వేషంవేసి సర్కారుగ్రామాలలోనే దస్తునసూలుచేసినాను. అటు వంటి వేషంకూడా పట్టుపడకుండా తప్పించుకుని పారిపోయినాను.

ధీని—నీవు అఖండశక్తిగలవాడవు. నారహస్యం వకటి వున్నది. అది నీవు దాచేపక్షముకు నీగుట్టు బయలపెట్టకుండా నేనూ దాస్తాను.

భీము—అలాగయితే మీరహస్యమూ ప్రతినెలా నాయాభయ్యేసి రూపాయలూకూడా దాస్తాను.

ధీని—మంచిది రూపాయలు నీమనసు వచ్చినట్టు చేసుకో. భీమా! యిప్పుడు మనలో వకరిసంగతి వకరికి బాగా తెలిసింది. ఇఖ నేను చెప్పేమాటవిను. ఈసాయంకాలము మాతండ్రిగారు యిక్కడకు

కోసుదూరంలోవున్న మాతోటచూడడానికి వెళుతారు. ఆయన మళ్ళీ రాత్రిపొద్దుపోయినదాకా యింటికిరారు. ఆయన వెళ్ళినతరువాత మేము సాయంకాలము వుత్సవం చూడడానికి వెళుతాము. వకవేళ నాతండ్రిగారికి తెలిసి నిన్ను అడిగినట్టయితే మేము యిల్లుకదలి యెక్కడకూ వెళ్ళలేదని నీవు ప్రమాణంచేసి చెప్పవలెను. అందు నిమిత్తమయి కొన్ని యేర్పాటులు చేసిరావడానికి యీలోపుగా వక్క మాటు వీధిలోకి వెళ్ళవలసివున్నది. నీవు యింతలో యీబట్టలు పింజెలుపెట్టి నేను లోపలినుంచి వచ్చేటప్పటికి తమలపాకులు చుట్టి సిద్ధంగావుంచు.

భీము—నావంటి మహామహోపాధ్యాయుడికి యిటువంటివి చెప్పవచ్చునా?

ధీని—నోరుమూసుకో. నీవు భీముడవుకాదా? (అని మీాద శడవేసి వెళ్ళుచున్నాఁడు.)

భీము—అవును మరచిపోయినాను. నెలకు యీాభయిరూపా యలు పుచ్చుకునేటప్పుడు యేపనిచెప్పినా చెయ్యవలెను. (అని యేదో పాటపాడుచుబట్టలు పింజెలుపెట్టుచున్నాఁడు.)

[కళావిదుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

కళా—శాస్త్రిగారూ! నేను మాతోటలోనికి వెళ్ళకముందు మీాతో—(బట్టలు పింజెలు పెట్టుచుండుటచూచి) ఇదేమిటి? మా అబ్బాయి బట్టలు పింజెలుపెడుతూవున్నారా?

భీము—(తనలో) అయ్యో! నాకు చావువచ్చింది. యిప్పుడు యేమని బొంకను? (బిగ్గరగా) అవును. ఈవిషయంలో మీారు మరివక లాగు అనుకోకండి. వక్కనిముషం వోపికపెడితే మీాకంతా తెలుస్తుంది. మీాకుమారుడివిషయంలో నేను చేసేపనులలో యిదికూడా వకటి.

కళా—ఇదంతాచూస్తే నాకు వింతగావున్నది. వక్కనిముషం కిందట మీరు మాదాసీగానికాళ్ళమీద పడ్డారు; ఇప్పుడు మావాడి బట్టలు పింజెలు పెడుతూవున్నారు. మీసంగతియేమీ నాకు బోధ పడడంలేదు.

భీము—అయివుండవచ్చును. మీరు వక్కనిముషం శాంతం వహిస్తే నా తాత్పర్యం యేమిటో మీకేవిశదమవుతుంది.

ధీని—(వెలుపలనుండి) నాబట్టలు యిలాగుతీసుకునిరా. వేగిరం తీసుకునిరా.

భీము—అడుగో! అడుగో! అతడు నాకోసం కనిపెట్టుకుని వున్నాడు. ఈబట్టలు అతనికియిచ్చి మళ్ళీవస్తాను.

కళా—కనిపెట్టుకుని వుండనియ్యండి. మీరు వెళ్ళకూడదు. వాడు గురువుగారి యెడల గౌరవం నేర్చుకోవలెను.

భీము—(తనలో) అతను యిక్కడకువస్తే నా పరువంతా పోతుంది. నాగుట్టు బయలపడుతుంది.

[ధీనిధి మహావేగముతో ప్రవేశించుచున్నాడు.]

ధీని—మొద్దులాగు యెంతసేపటికీ నాబట్టలు తీసుకునిరావేమి? నేను యిప్పుడు—(అప్పుడు తండ్రినిచూచి సిగ్గుపడియూరకున్నాడు.)

భీము—నీకు అడ్డంయేమిటి? యిష్టంవుంటే వకదెబ్బకూడాకొట్టు. (కళావిదుని వంకతిరిగి) ఇదుగో యిప్పుడు చూడండి. మీకుమారుడికి సత్ప్రవర్తన యెలాగు నేర్పుతానో. (ధీనిధితో రహస్యముగా) నేను మీబట్టలు పింజెలు పెట్టినందుకు క్షణంసేపుమీరు మాటాడకుండా నేను చెప్పేనీతులు వినండి. నేను మీకు యిప్పుడు వినయం బోధిస్తాను. (బిగ్గరగా) ఇయిగోనీబట్టలు పుచ్చుకో. ఇలాగు పెద్దలవిషయంలో అప

చారం చెయ్యడంవల్ల పెద్దలకు యేమీలోపంరాదుగాని చిన్నవాళ్ళే దుర్నయం పట్టుపడి చెడిపోతారు. ఇలానడుచుకోవడం నీకు యెంతమాత్రమూ శ్రేయస్కరంకాదు. దీన్నిబట్టి నీవుపెద్దలయెడల భక్తి నమ్రతా నేర్చుకోవలెను. తెలిసిందా?

ధీని—తెలిసింది. (అని సిగ్గుపటించుచు తలవంచుకొనుచున్నాడు.)

భీము——ఓకళావిదుడుగారూ! ఆచిన్నవాడివంక చూడండి. అతడు తలవంచుకొని యెలాపశ్చాత్తాపపడుతూ వున్నాడో! దీనితో బుద్ధివచ్చింది. యితను యిఖయెప్పుడూ పెద్దలయెడ అవిధేయతగా ప్రవర్తించడు.

కళా——ఇదంతా నాకు నిజంగానే అద్భుతంగా వున్నది.

భీము——(ధీనిధితో) నేను యిప్పుడు బోధించిన నీతి నీవుయెప్పుడూ మరిచిపోకూడదు. ఇది శిలాక్షరంవలె నీమనస్సులో నాటుకొని వుంటుంది.

కళా——(తనలో) సందేహంలేదు. ఈయన గొప్పవాడే. (బిగ్గరగా) మీబోధ చేసేవిధం అద్భుతంగావున్నది. ఈమోస్తరు నేను యెక్కడా చూడలేదు. ఇప్పుడు నేను వచ్చినపని మీతో చెప్పడం మరిచిపోయినాను. నేనువక ముఖ్యమయినసంగతి మీతో చెపుదామని వచ్చినాను. ఈ సాయంకాలం పూళ్ళోవుత్సవం జరుగుతుంది. ఇతణ్ని యెంతమాత్రమున్ను మీరు వుత్సవంలోకి వెళ్ళనియ్యకూడదు. నా బండీదాకా నాతో దయచెయ్యండి. ఈ విషయంలో మీతో కొన్ని సంగతులు మనవిచెయ్యవలసి వున్నవి. (అని భీమునితోఁగూడ వెళ్ళు చున్నాఁడు.)

ధీని——అహాహాహా! ఈభీమిగాడు నాఅదృష్టంచేత నాకు గురువుగా దొరికినాడు. ఏమి నాభాగ్యము!

[వసంతతిలక ప్రవేశించుచున్నది.]

వసం—మామగారు యిప్పుడే వెళుతూవున్నారు. యింకొక్క నిముషంలో యీయిల్లంతా మనస్వాధీనం అవుతుంది. మనంస్వేచ్ఛగా వుండవచ్చును. మనం యివేళ వుత్సవంలోకి వెళ్ళడం వున్నదాలేదా?

ధీని—కొంచెంసేపు శాంతంవహించు. అయనకొంచెందూరం సాగడంతోటే మనమూనడుతాము. నీకోసం బండిమాట్లాడివచ్చినాను.

వసం—కావలసినంతసేపు వహిస్తాను. నాకు మహాసంతోషంగా వున్నది. తన ముసలి సరసుడు భీముడు మీకు గురువుగా వచ్చినాడని చంద్రిక యిప్పుడే నాతో చెప్పింది. (అని నవ్వుచున్నది.)

ధీని—అవును. (అని నవ్వుచున్నాడు.)

[చంద్రిక ప్రవేశించుచున్నది]

చంద్రి—కళావిదుడుగారు తోటలోకి వెళ్ళిపోయినారు. ఆయన బండిలో యెక్కబోతూ వుండగా విద్యానాథుడిగారి బళ్ళోపిల్లవాడు వకడు వకవుత్తరం తీసుకుని వచ్చి చేతికిచ్చినాడు. ఆవుత్తరం చూడగానే లోపల యేదో విచారంగలిగి ముఖం చిన్నపోయింది. అయినా కానీ ఆయన ఆగకుండా వెళ్ళిపోయినాడు.

ధీని—ఆవుత్తరం యేమయివుంటుంది? యేమీలేదు. ఆవుత్తరం జోలి మనకెందుకు?

చంద్రి—అంతేకాదు చెప్పవలసింది యింకావున్నది. ఆయన వెళ్ళిపోయిన తరువాత మీమహామహోపాధ్యాయులుగారు నాదగ్గిరకు వచ్చి నీతోకొన్ని రహస్యమైన సంగతులు చెప్పవలసివున్నది. నీగది యెక్కడని నన్ను అడిగినారు.

వసం—నీవు నీగది అతనికి చూపించినావా?

చంద్రి—చూపించలేదు. అదుగోనని కిటికీమాత్రం చూపించి మీతో చెప్పడానికి పరుగెత్తుకు వచ్చినాను.

ధీని—ఓప్రాణేశ్వరీ! దీసమాటలు యేమివింటావు? అవతలవుత్స వంలో యీపాటి తమాషా లారంభమవుతవి. వెళ్ళిచూతాముగా.

(అందఱును వెళ్ళుచున్నారు)

——

3. రంగము—బజారులోని కొట్టుముందరి యరుగు.

[ధీనిధిమిత్రుఁడగు సుహృదుఁడును మరి ముగ్గురుమనుష్యులును ప్రవేశించుచున్నారు.]

సుహృ—రథం యీవీధినుంచి వెళ్ళేవేళకావచ్చింది. ధీనిధి యింకా వచ్చినాడుకాడేమి?

మొదటివాఁడు—ఆతడు తండ్రితో తోటలోకి వెళ్ళినాడేమో!

సుహృ—వెళ్ళివుండడు. అతను యిక్కడికి ఆడంగులతోకూడా వస్తానని యీవుదయాన్న నమ్మకంగాచెప్పి వెళ్ళినాడు. స్త్రీలకోసం నేను యీకొట్టు ఖాలీచేయించి వుంచినాను. మాస్త్రీలుకూడా వచ్చి వున్నారు.

రెండవవాఁడు—అడుగో బండిముందు ధీనిధివస్తూవున్నాడు.

[ధీనిధియు, వసంతతిలకయు, చంద్రికయు, ప్రవేశించుచున్నారు.]

అందరు—ధీనిధిగారూ! దయచెయ్యండి. మేమందరమూ మీరాకనిమిత్తమే యెదురుచూస్తూవున్నాము.

ధీని—మీరునాకోసం కనిపెట్టుకుని వుంటారనే తొందరపడి సాధ్యమయినంత శీఘ్రంగా వచ్చినాను. యింకా సంగీతం ఆరంభించినారుకారేమి?

సుహృ—ఫిడేలు వాయించే జోగడు యింకా వచ్చినాడుకాడు. ఫిడేలుమాత్రం పొద్దున్నే యిక్కడ పెట్టిపోయినాడు. వర్తమానంపంపితే వాడుయింటికాడ కనపడలేదు.

ధీని—ఫిడేలువాయించేవాణ్ని మరియెవరినైనా చూడవలెను. వసంతతిలకా! మీరాగదిలోకి వెళ్ళండి. యీదారిని వెళ్ళేతమాషాలన్నీ మీకక్కడనుంచి కనపడతవి.

వసం—చంద్రీ! మనం లోపలికి వెళుదాముదా. (అని వెళ్ళుచున్నారు.)

[అప్పుడు రొజుచు భీముఁడు ప్రవేశించుచున్నాఁడు.]

భీము—అయ్యో! నేను చచ్చిపోతాను. నావీపువిరిగి పోయింది.

ధీని—భీమా! అదేమిటి!

భీము—ధీనిధీ! నీవు యిక్కడనే వున్నావా? అదంతా నీతో నిమ్మళంగా చెపుతాను. మీతండ్రిగారు నిన్ను యిక్కడికి వెళ్ళవద్దని చెప్పినారుగదా యెందుకువచ్చినావు?

ధీని—ఆట్టే అధికప్రసంగం చెయ్యక వూరుకో. ఈయన సంగీతంపాడుతాడు. ఇక్కడ ఫిడేలు వాయించేవారు యెవరూలేకుండా వున్నారు. కాస్తసేపు వాయిస్తావా? ఓసుహృదా! ఇతనికి సమానంగా ఫిడేలు వాయించేవారు మనదేశంలో యెవరూ లేరుసుమా. ఆఫిడేలు యితని చేతికివ్వండి.

భీము—వద్దు వద్దు. అటువంటి నీచపుపని నాకుచెప్పడం మీకు ధర్మంకాదు. నేను మీగురువునన్నమాట జ్ఞాపకంవున్నదా? గురువుకు మర్యాదచెయ్యవలెను.

ధీని—కావలసినంత మర్యాదచేస్తాను. నీకు మాఅందరికంటెనూ వున్నతాసనం యిస్తాము. ఆగూట్లోకూర్చుని వాయించు. నామాటకు యెదురుచెప్పినావంటే చావగొడుతాను.

భీము—నలుగురిలోనూ నా గౌరవమంతా పోతూవున్నది. ఫిడేలు యిలా తెండి. (అని గూటిలోకూరుచుండి వాయించు చున్నాఁడు.)

సుహృ—"బుద్ధిరాదు బుద్ధిరాదు— పెద్దలసుద్దులు వినక—యోగము లభ్యసించిన, యాగము లెన్నిచేసిన—" (అని శంకరాభరణము రాగమువిూద శ్రావ్యముగా పాడుచున్నాఁడు.)

భీము—మేలు మేలు! (అని యుత్సాహముతో తలయెగరవైచుచు వాయించు చున్నాఁడు.)

[ఆసమయములో కళావిదుఁడును. విద్యానాథుఁడును, ప్రవేశించు చున్నారు.]

కళా—ఇక్కడ ధీనిధిన్నీ మహామహోపాధ్యాయులు గారున్ను కూడా వున్నారా?

భీము—(చటుక్కున ఫిడేలు వెనుకకు పెట్టుకొనుచు) ఇఖ నేను చెడిపోయినాను.

కళా—ఉపాధ్యాయులుగారూ? విూచర్యలుచూస్తే నాకు సహసంవుండకుండా వున్నది.

భీము—విూరు యిక్కడ నన్నుచూచినారు కాబోలును? ఇక్కడ నేను వున్నమాట నిజమే కావచ్చునుకాని యిందులో నాతప్పితేం యేమీ లేదు. విూదగ్గిరశలవు పుచ్చుకుని నేనువస్తూవుండగా యిక్కడ నాకు ధీనిధి కనపడ్డాడు. అతణ్ని యింటికి తీసుకుని వెళ్ళడానికి నేను యిక్కడవున్నాను. విూకిది స్పష్టంగా కనపడడం లేదా?

కళా—అదేనిజమైతే విూరు గూట్లోకూర్చుని తలతిప్పుతూ ఫిడేలు యెందుకు వాయిస్తూవున్నారు?

భీము—వాయించకపోతే వీళ్ళుకొట్టిపోతారని ఫిడేలువాయిస్తూవున్నాను. ఇఖ గూట్లోకూర్చోవడానికి కారణంవినండి. ఇదివున్నత స్థానము. నావంటి మహామహోపాధ్యాయులకు అర్హమైనది.

కళా—ఇఖనీమాటలు నేనుయెంతమాత్రమూ నమ్మను.

విద్యా—ఇందాకావీణ్ని చీపురుకట్టపుచ్చుకుని వీపుబద్దలయ్యేటట్టు కొట్టినాను. ఈసారి కొడితే తలబద్దలకొడుతాను.

భీము—తలబద్దలు కొట్టడానికి నీతాతతరంకాదు. నేనుయిక్కడ ఘరానామనిషిలాగు నడుచుకుంటూవున్నాను. గానీ చిల్లరమనిషిలాగు ప్రవర్తించడంలేదు.

కళా—మీవంటి ఘరానామనుష్యులున్ను పండితులున్ను నా మేనకోడలివద్దవున్న దాసీదాని వంటిదాన్ని పెళ్ళిచేసుకోవడానికి ప్రయత్నంచేస్తారా?

భీము—నావంటిపండితుల కటువంటి భేదాలువుండవు. నాదృష్టికి గొప్పవాళ్ళూ కొద్దివాళ్ళూ సమానమే. విద్యానాథా! చంద్రిక దగ్గిర యేమయినా డబ్బువున్నదా?

విద్యా—అదినూరురూపాయలు నాకుబదులిచ్చింది. అది నిన్ను పెళ్ళాడేటట్టయితే దానినూరు రూపాయలూ తక్షణం పారవేస్తాను.

భీము—ఆరూపాయిాలు యివ్వండి. నేను చంద్రికను పెళ్ళాడుతాను—

సుహృ—(ముందుకువచ్చి) నీ పెళ్ళిలోనన్ను సంగీతం పాడడానికి పిలుస్తావా?

భీము—రేపు ధీనిధికిన్ని వసంతతిలకకున్ను పెండ్లి అయ్యేటప్పుడు మాపెళ్ళికూడా వారిపెళ్ళితోనే అవుతుంది. అప్పుడు నీవువచ్చి సంగీతం పాడుదువుకానిలే.

కళా—వాళ్ళయిద్దరికీ రేపు పెళ్ళి అవుతుందని నీతో యెవరు చెప్పినారు?

భీము—యెవరూ చెప్పలేదు. నేను వూరికే అనుకున్నాను.

కళా—నీవుశుద్ధదొంగవు. నీ సంగతంతా నేను కనుక్కున్నాను. ఈవుత్తరంవల్ల నిజమయిన మహామహోపాధ్యాయ తర్కపంచాననులవారు రావడానికి వప్పుకోనట్టు కనపడుతూవున్నది. నీవు ఆయనపేరు పెట్టుకొని దొంగవేషం వేసుకుని వచ్చినావు. నీవు యెవరు?

ధీని—నా మాటవినండి. నేను యితణ్ని బాగాయెరుగుదును. కాలకర్మదోషంచేత యితడు యిప్పుడు యీవేషం వేసుకొనివచ్చినా, ఇతడు బహుమంచివాడున్ను, కష్టపడి పనిచేసేవాడున్ను, చంద్రికకు యితను తగినవరుడు. చంద్రికను యితనికి వివాహం చేయించి యితణ్ని మనయింట్లో నవుకరీకి వుంచుకుందాము. ఇతనిదగ్గిర దొంగతనము లేదు. పరులసొమ్ముదమ్మిడీ హరించడు. బహునమ్మకమయినవాడు.

భీము—ఆ విషయంలో మీరేమీ సందేహించకండి. పెళ్ళయిన తరువాత కొన్నాళ్ళు మీ యింట్లో వుంచుకుని పరీక్షచేసి చూడండి. నాపేరుభీముడు. నేను వెనుకటి భీముడిలాగు పనిచేస్తాను. ఈ సభవారితో వక్కమనవి చేసుకుంటాను. యిఖముందు అయ్యగారి యింటికి మీరు వచ్చినప్పుడు మీకందరికీ తలుపులు నేనే తీస్తూవుంటాను.

కళా—నీవు అసాధ్యుడవు. యీపాటి యింటికి వెళుదాము నడవండి.

[అందఱును వెళ్ళుచున్నారు.]

మోడరన్ ప్రెస్, కలర్ ప్రింటర్స్ & బాక్సు మేకర్స్, రాజమండ్రి.

యోగనిద్రా ప్రహసనము

గ్రంథకర్త:
కందుకూరి వీరేశలింగము పంతులు

మూడవ కూర్పు

ప్రకాశకులు:
హితకారిణీ సమాజము,
రాజమహేంద్రవరము

1950

 [వెల రు 0-6-0

యోగనిద్రాప్రహసనము

— ఈనాటకమునందువచ్చు పాత్రములు —

మతిమంతుఁడు—యోగశాస్త్రాభ్యాసము చేయుచున్న యొక వృద్ధుఁడు

సుబలుఁడు—మతిమంతుని మేనల్లుఁడు

సదానందయోగి—భూతవైద్యము తెలిసినయోగి

గజాననదాసు—వైద్యుఁడు

రాముఁడు—మతిమంతుని సేవకుఁడు

సుమతి—మతిమంతునికూఁతురు

గౌరి—మతిమంతుని యింటిదాసి

రంగము—మతిమంతుని యిల్లు.

[సుమతి ప్రవేశించుచున్నది]

సుమ—వొంటిరిగాకూర్చుంటే యేమీా తోచకుండావున్నది. మాట్లాడడానికి వక్క రాముడుతప్ప మరియెవరూ కనపడరు. వాడు యెప్పుడూ యేదో సణుక్కుంటూవుంటాడు. నాన్నగారు యోగపు పిచ్చిలోపడి రాత్రీ పగలూ ముక్కుమూసుకుని కూర్చుంటూ పాత తాటాకుల పుస్తకాలు ముందువేసికొని ఆకులు తిరగవేస్తూ రెండో ధ్యానంలేకుండా వున్నారు. ఆపిచ్చపుస్తకాలచేత ఆయనకు మతిపోతూ వున్నట్టున్నది. అనుగోయేదో చప్పు డవుతూ వున్నది. (చూచి)

రాముడు పుస్తకాలకట్ట కిందపడ వేసినాడు. ఓరీ! రామా! యేమిటి చేస్తూవున్నావు?

[అప్పుడు రాముఁడు ప్రవేశించుచున్నాఁడు.]

రాము—యేమీ చెయ్యడంలేదు. పుస్తకాలు చేతులోనుంచి జారిపోయినవి. దిక్కుమాలిన పుస్తకాలు వొకొక్కటి నాలుగేసి మళ్ళ బలువువున్నవి. ఈగదిలోకి తీసుకురావలసినవి యిటువంటివి పది పుస్తకాలున్నవి. ఈపొస్తకం కాలిమీదపడి కాలివేళ్ళన్నీ నలిగి పోయినవి. (అనిచేతిలోని పుస్తకములుబల్లమీద పెట్టుచున్నాఁడు.)

సుమ—(నవ్వుచు) ఆ పుస్తకం కిందపడ వేసినందుకు నాన్న గారు కోపపడుతారేమో?

రాము—నేను పడవెయ్యలేదు. దానంతట అదేపడ్డది. చేతులో వుండకుండా పసిపిల్లకాయలాగు జారికిందపడ్డది. నా తప్పితం యేమీ లేదు.

మతి—(వెలుపలనుండి) రామా! రామా!

రాము—వస్తూవున్నాను. వచ్చెవచ్చె—అమ్మగారూ! చూచినారా ఆయన యెలాగు తొందర పెడుతూవున్నారో.

మతి—(వెలుపలనుండి) రామా! రామా!

రాము—తొందరపడకండి. వస్తూవున్నాను. ఇక్కడ నేను ఆడు కోవడంలేదు. (అని క్రిందపడ్డ పుస్తకమును చేతితో తీయుచున్నాఁడు.)

[అంతట మతిమంతుఁడు ప్రవేశించుచున్నాఁడు]

మతి—రామా? మిగిలిన పుస్తకాలు నీవుయివేళ యిక్కడకు తీసుకునిరావడం వున్నదా? రోజంతా యిక్కడనే వుంటావా?— అమ్మాయీ? నీవూ యిక్కడనే వున్నావా?

సుమ—యిప్పుడేవచ్చినాను. తోటలో నాకు సంపెంగ పువ్వులు కోసియిస్తామన్నారు వస్తారా?

మతి—యిప్పుడు రావడానికి తీరుబడిలేదు. నేనను యిప్పుడు పుస్తకంలో ప్రాణాయామాన్నిగురించి చదువుతూ వున్నాను. అది అర్థంకావడంలేదు. అదిగ్రహిస్తేనేకాని నేను యెక్కడికీరాను — ఓరీ రామూ! మా మాటలు అలకిస్తూ అలానిలుచున్నావేమి? నీవు కింద కూర్చుండి పుస్తకాలన్నీ బల్లమీద వరుసగాపెట్టు.

రాము—చిత్తము. (అని యొకపుస్తకము క్రిందవేసి దానిమీద కూర్చున్నాడు.)

మతి—ఓరిపశువా! పతంజలిమీద కూర్చున్నావేమిరా? లేలే. అపచారంవస్తుంది. ఆయన యెవరనుకున్నావు? మొట్టమొదట యోగ సూత్రాలుచేసిన మహానుభావుడు.

రాము—అపచారం రావడానికి నేను యెవరిమీదా మనిషి మీద కూర్చోలేదు. బట్టబురదవుతుందని యెందుకూ పనికిమాలిన యీపాతతుక్క పుస్తకంమీద కూర్చున్నాను. కిందమనిషివుంటే కూర్చోవడానికి నాకంత బొత్తిగా కళ్ళుకనపడ వనుకున్నారా యేమిటి?

మతి—అది పనికిమాలిన పాతతుక్కపుస్తకమట్రా? దాని విలువ చదువురాని శుద్ధపశువువు నీకు యేమి తెలుస్తుంది? నేను నిన్నటి రోజల్లా కష్టపడి అంటలుకట్టుకుపోయిన పత్రాలన్నీ జాగ్రతగావిడదీసి పురుగులుదులిపివేసి కట్టకట్టినాను. రెండువ్యాఖ్యానాలతోవున్న దాన్ని పనికిమాలిన తుక్కంటావురా?

[అప్పుడు చేతిలో నొకయుత్తరము పట్టుకొని గౌరి
ప్రవేశించుచున్నది.]

గౌరి—అయ్యా! మీకు టపాలో వుత్తరంవచ్చింది. (అని చేతి కిచ్చి వెళ్ళుచున్నది.)

మతి—ఏమిటీ! వుత్తరమా? ఆగమశాస్త్రవేత్తఅయిన గౌరీపతి శాస్త్రుర్ల దగ్గిరనుంచి కాబోలును. (అని చూచి) కాదుకాదు. ఈవుత్త రం తరువాత నెమ్మదిగా చదువవచ్చునులే. (అని క్రింద పడవేయు చున్నాఁడు.)

సుమ—నాన్నగారూ? మీరు వుత్తరంవిప్పి చదువుకోకుండానే కిందపడవేసినారు. దానిలో యేమయినా జరూరు సంగతులున్నవేమో! నేను విప్పి చదువుదునా? (అని యుత్తరము పుచ్చుకొనిచూచి) దీని మీద పెద్దాపురంముద్రవున్నది. ఇది మామయ్యదగ్గిరనుంచి వచ్చింది వేగిరం చదవండి.

మతి—(ఉత్తరమువిప్పి చదివి) పిచ్చివాడా? ఇది బాగానే వున్నది. అంతకంతకు పిచ్చిముదిరితే యేమో స్తరుకువస్తుందో? అయినా ఫర్వాలేదు. నేను యోగదృష్టితోచూచి మనోబలం వుప యోగ పరిస్తే యెటువంటివాణ్నయినా నిముషంలో వశపరుచుకో వచ్చును. అతను రావడంతోటే ప్రయత్నంచేసి చూస్తాను. ఇప్పుడు వెళ్ళి పక్కనిముషం ప్రాణాయామంబట్టి మళ్ళీవస్తాను. (అని యుత్తర మక్కడ పడవైచి వెళ్ళుచున్నాఁడు.)

సుమ—నాన్నగారు వూరికే జపంపిచ్చలో పడిపోయినారు. తిన్నగా వేళకు భోజనానికైనా రావడంలేదు. నేను యీవుత్తరములో యేమివున్నదో చదువుతాను. (అని చదువుచున్నది. "మీచెల్లెలు పోయినప్పటినుంచీ మీ మేనల్లుడికి విచారంచేత బొత్తిగా పిచ్చియెత్తి

పోయింది" పాపం సుబలుడికి పిచ్చియెత్తింది కాబోలును. అతణ్ని చూచి నాలుగుసంవత్సరాలు కావచ్చింది. ఇక్కడవున్నప్పుడు అతను నామీద యెంతో ప్రేమగా వుండేవాడు. తరువాత చదువుదాము— "అతనికి యేమీ తోచక వూరికే పిచ్చివాడులాగు తిరుగుతూవున్నాడు. అతనికి మనస్సు స్వస్థతపడేదాకా కొంతకాలంమీదగ్గిరవుండడానికి నేటి సాయంకాలమే మీదగ్గరకు పంపిస్తూవున్నాను. రేపు మధ్యాహ్నానికి అక్కడకువస్తాడు."—రేపుమధ్యాహ్నానికా? అలాగైతే యింక కాస్త సేపటికి వస్తాడు— "అతనివిషయం మీరు కొంచెం శ్రద్ధవహించి మనస్సు స్థిమితపడేటట్టు చెయ్యవలెను. సుమతితోకూడి అల్లరిగా తిరగనియ్యకండి. మావాణ్ని మీ యోగపిచ్చలోమాత్రం దింపవద్దు. వాడికి యిదివరకువున్న పిచ్చచాలును."

రాము—అలాగైతే యిఖ మనయింట్లో పిచ్చివాళ్ళు వకరికి యిద్దరవుతారు.

సుమ—వకరెవరురా!

రాము—అయ్యగారు.

సుమ—నోటిమీదతన్ని పోయేరు. ఇటువంటి పేలాపనలుపేలకు గౌరిని నేను రమ్మన్నానని నాగదిలోకి పంపించి నీవువెళ్ళి నీపనిచేసుకో. పో. (అని వెళ్ళుచున్నది.)

రాము—అమ్మా! యిప్పుడే వెళుతాను. అయ్యో! అప్పుడే యీవిడె వెళ్ళిపోయిందే. అమ్మాయిగారికి నామీదకోపంవచ్చింది కాబోలును. అమనోగౌరి యిక్కడికే వస్తూవున్నది. నేను వెళ్ళనక్కరలేదు.

[గౌరి ప్రవేశించుచున్నది]

గౌరి—ఓయీరామూ! నీవు వొంటరిగా యిక్కడ యేమి చేస్తూ వున్నావు? మామూలుప్రకారంగా నీలోనీవు సణుక్కుంటూ వున్నావా యేమిటి?

రాము—నేనుచేసేపనే నీవుచేసేటట్టయితే నీవునాకంటె యెక్కు వపనుఋక్కుందువు. పురుగులు దులిపివేసి పక్కపుస్తకానికి వర్ణంవేస్తే నాకువుండేకష్టం నీకు అప్పుడు తెలుస్తుంది. ఓసీ! గౌరీ! ఈరోజుమన యింటికి యెవరోవస్తారట! యెవరువస్తారో యెరుగుదువా?

గౌరి—యెరగను. యెవరో మంత్రాలు తెలిసిన యోగులు వస్తారనుకుంటాను.

రాము—కాను కాదు. ఒకపిచ్చివాడు వస్తూవున్నాడు.

గౌరి—పిచ్చివాడా! నాకు భయం వేస్తూవున్నది. అతను యెవ రినీ కొట్టేటిట్టి వాడుకాడుగద.

రాము—ఏమో తెలియదు. అతడు మనయజమానుడికి జతగా వుంటాడు. అయినా కానీ అతడుకూడా తాను వచ్చేటప్పుడు పాత తాటాకుల పొస్తకాలు యేమయినా తెస్తాడేమోనని నాకూ భయం గానే వున్నది.

గౌరి—పొస్తకాలు తెస్తేనేమికాని అతడుకొట్టేవాడవునో కాదో కనుక్కొని ముందుగా చెప్పుదూ.

రాము—కనుక్కో నక్కరలేదు. వాళ్ళకుకొంచెం వ్యతిరేకంగా యేమయినా చేసినా అన్నా పిచ్చివాళ్ళందరూ కొడుతారు. నీవు జాగ్ర తగా వుండవలెను? నీవు అతను చెప్పినట్లల్లా చెయ్యకపోతే నీ కొప్పులో వెంట్రుకలు నాలుగూ వూడదీసి చేతులో పెడుతాడు.

గౌరి—అలాగైతే నాకుమరీభయంవేస్తూవున్నది. మూర్ఛ వస్తూవున్నది. (అనిమిూదపడఁబోవు చున్నది.)

రాము—గౌరీ! దూరంగాపో. ఇక్కడ మూర్ఛపోకు. నీకు మూర్ఛపోవడం యిష్టంగావున్నట్టయితే లోపలికిపోయి నీళ్ళపొయికాడ నిప్పులలోనూ నీళ్ళలోనూ మూర్ఛపో.

గౌరి—రామా! నీవుయింత క్రూరుడవవుతావని నేనుయెన్నడు అనుకోలేదు. నీవు నామతిపోగొట్టివేసినావు. (అని యేడ్చుచున్నది.)

రాము—నీకేమీ భయములేదు యేడువకు. ఆపిచ్చివాడు నీ జోలికి రాడులే. ధైర్యంగావుండు.

గౌరి—నీవు చెప్పినమాటలు విన్నతరువాత మళ్ళీధైర్యంయెలా వస్తుంది? మూర్ఛవస్తూవున్నది. ఇదుగో మూర్ఛపోతూవున్నాను.

(అని సోలుచున్నది.)

మతి—(వెలుపలనుండి) రామా! రామా!

రాము—అయ్యో! అయ్యగారు పిలుస్తూవున్నారు.

గౌరి—ఇటువంటి మూర్ఛలో నీవునన్ను వదిలిపెట్టి వెళ్ళకూడదు.

రాము—మూర్ఛపోవడానికి ఇదిసమయంకాదు. మనయజమానుడు జపంమీద కూర్చున్నప్పుడు సమయం కనిపెట్టి చెప్పుతాను. నీవప్పుడు కావలసినంతసేపు సావకాశంగా మూర్ఛపోవచ్చును. ఇప్పుడు లేచి వేగిరం యింట్లోకి పరుగెత్తు.

గౌరి—నీమాటప్రకారం నడుచుకుంటాను. (అని లేచి వెళ్ళుచున్నది.)

[అంతట మతిమంతుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

మతి—ఓరి మొద్దా! పిలవగానే యెందుకురావు? నీవుయెప్పుడు దానితో పరియాచికాలాడుతూ కూర్చుంటావు.

రాము—అలాగంటిపని నేనుయెప్పుడూ చెయ్యడంలేదండి. అదే నన్ను పరియాచకాలు చేస్తూవుంటుంది.

మతి—చాలును. ఈపాటినోరుమూసుకో. ఈవేళ మనయింటికి నామేనల్లుడు వస్తూవున్నాడు. అతనికి కొంచెం చిత్తచాంచల్యం.

రాము—అదియేమిటండీ?

మతి—మరేమీలేదు. మతిభ్రమవస్తూవుంటుంది.

రాము—మీరు చెప్పినవేవో నాకు తెలియవు. ఆవచ్చేవి రెండూ యేవో జంతువులనుకుంటాను. అవియేమీ హానిచేసేవి కావు గద?

మతి—జంతువులూలేదు నీమొఖమూలేదుపూరుకో. నామేనల్లుడి విషయంలో నీవే చాలాశ్రద్ధ పుచ్చుకోవలెను. అతణ్ని నీవు యెప్పుడూ కనిపెట్టివుండి చూస్తూ మంచిమాటలుచెవుతూ కోపం రాకుండా చెయ్యవలెను. అతణ్ని రెచ్చకొట్టినావంటే నీతలకాయబద్దలకొడుతాడుసుమా. జాగ్రత. అతనికి యెప్పుడూ చిరాకు తెప్పించకు.

రాము—తెప్పించను. అతనిమీద యెప్పుడూ వకకన్ను వేసి జాగ్రతగా వుంటాను.

మతి—(ఆలకించి) అదుగో బండీచప్పుడవుతూ వున్నది. అతను వచ్చినట్టున్నాడు. రామా! అతణ్ని నీవువెళ్ళి లోపలికి తీసుకునిరా.

రాము—చిత్తము. (అని వెళ్ళుచున్నాడు)

మతి—సదానందయోగికిన్నీ గజాననదాసుకున్ను వర్తమానం పంపించినాను. వారుయిద్దరూవచ్చి యితణ్ని సావకాశంగా పరీక్షచేసి చూచి జబ్బుయొక్క స్వభావం నిశ్చయంచేసి చెపుతారు. వారు యిద్దరూ నిస్సందేహంగా చిత్తచాంచల్యమనే నిశ్చయం చేస్తారు. పాములమంత్రగాడు తాచుపామును వశ్యంచేసుకున్నట్లు నేను యీ రోగిని యోగదృష్టిచేతచూచి నిముషంలో లోబరుచుకుంటాను. యోగమహిమ కనపరచడానికి యిప్పుడు మంచి అవకాశం కలిగింది. మనో బలంచేత యెటువంటి రోగాలనైనా మళ్లించవచ్చును. అతడు యెంత అల్లరిచేస్తూవున్నా మనస్సుస్థిరపరిచి తేరపారచూచినానంటే యోగ

నిద్రచేత చిత్రపు ప్రతిమలాగు అయిపోతాడు. అడుగో అతను వస్తూవున్నాడు. నేనులోపలికి వెళుతాను. అతణ్ని చూస్తే నాకు దేహం పులకరిస్తూవున్నది. (అని వెళ్ళుచున్నాఁడు.)

[సుబలుఁడును రాముఁడును ప్రవేశించుచున్నారు.]

సుబ—పడవలు కొంచెం ఆలస్యంగా బయలుదేఱినా యెలాగైతే నేమి కష్టపడి అనుకున్న వేళకు యిక్కడచేరినాము—ఓయి రామా మా సామానంతా లోపల యేదైనాగదిలోపెట్టించు. ప్రయాణం తొందరలో రాత్రినేను తిన్నగా భోజనం చెయ్యలేదు. ఆకలివేస్తూవున్నది. వంటయిందేమో కనుక్కునిరా.

రాము—(ఇల్లునాలుగు ప్రక్కలనుచూచి) వీటితో యెవరినీ కొట్టడానికి యితనికి అవకాశం లేకుండా చేస్తాను. (అని గోడమూలల నున్నచేతి కఱ్ఱలన్నియు పోగుచేయుచున్నాఁడు.)

సుబ—(కోపముతో) ఓరీ! నీతో నేను చెప్పినపని యేమిటి? నీవు యిక్కడ చేస్తూవున్న పనియేమిటి?

రాము—చిత్తముచిత్తము. వెళుతూవున్నాను. (అని కఱ్ఱలు చేతఁబట్టుకొని నడుచు చున్నాఁడు.)

సుబ—వీడిమోస్తరు చూస్తే తమాషాగావున్నది, ఇక్కడ వుంటే నేనాకఱ్రలు యెత్తుకుని పారిపోతాననుకున్నాడు కాబోలును. ఈ సావిట్లో నేను యిదివరకు కూర్చుని నాలుగుసంవత్సరాలు అయింది. అప్పుడు నేనూ సుమతీ యెంతో వినోదంగా ఆడుకుంటూవుండే వాళ్ళము. సుమతి యీపాటికిబాగా పెద్దదయి వుంటుంది. అప్పటికే యెంతో అందంగా వుండేది.

మతి—(తలుపుచాటునుండి చూచుచు) అమ్మాయీ! సుమతీ! మీబావస్థితి చూచినావా? గౌరీ! మమ్మలిని తోసుకునిరాకు. నీవు తరువాత చూస్తువుకానిలే.

సుబ—మానాన్నగారు నన్ను యిక్కడకు అథాత్తుగా పంపించివేసినారు. మా మామగారు పట్టిచేదస్తుడు. ఇప్పుడు యోగపు పిచ్చలోపడి నిద్రాహారాలు లేకుండా రాత్రీపగలూ దానిలో మునిగి తేలుతూ వున్నాడట. అయినాకానీ యిక్కడ నాకు మనసుకలిసిన సుమతి యింట్లోవున్నదిగనుక వేడుకగా ప్రొద్దుగడపవచ్చును. యీ తాటాకు పుస్తకాలన్నీ మామగారి పాతపురాణాలు కాబోలును.

మతి—(చెవిలో గుసగుసలాడుచు) అమ్మాయీ! అవిపాత పురాణాలట. తానుకాదు. నేనేపిచ్చలోపడి వున్నానట. ఆమాటలు విన్నావా? ఈగౌరివూరికే తొందరపడుతూవున్నది. దాన్ని చూడనియ్యి. మనం వెళుదాము. (అని వెళ్ళుచున్నారు.)

సుబ—(తలయెత్తిచూచి) యెవరో గుసగుసలాడుతూ వున్నట్టున్నారు. అదుగో ఆతలుపుదగ్గిర యెవరో చీరెకట్టుకుని నిలుచున్నారు. (అని తలుపువద్దికి వెళ్ళి తలుపు తీసి గౌరిని ఈవలికి లాగుచున్నాఁడు.)

గౌరి—(కాళ్ళమీదపడి) మహాప్రభో! నన్ను రక్షించండి. చంపకండి. నాతల్లి ముసలిది. దానికి నేనుతప్ప మరియెవరూ దిక్కులేరు. నేనూ పదిహేడేళ్ళదాన్ని. కొంచెం కాలంలోనే పెళ్ళిచేసుకుని సుఖపడవలె ననుకుంటూవున్నాను. నా ప్రాణాలు కాపాడండి.

[అంతట రాముఁడు ప్రవేశించుచున్నాఁడు]

రాము—(తనలో) ఈపిచ్చివాడు దీన్ని కాగలించుకోవడానికి ప్రయత్నం చేస్తూవున్నట్టున్నాడు. ఇదివరకవేళ అయితే మదపిచ్చ అయివుంటుంది.

సుబ—(పకపకనవ్వుచు దానిని లేవదీసి) హాహాహా! నీకిప్పు డేమీ ప్రాణభయం లేదు. లే. (పయివంకచూచి) ఆవచ్చిన వారెవరు?

రాము—బాబూ! నన్ను కొట్టకండి. నేను వెళ్ళిపోతాను. (అని గంతులు వేయుచున్నాఁడు)

సుబ—అమ్మా! నీవు వెళ్ళిపో.

గౌరి—దేవుడా! ఇవేళకు బ్రతికి పోయినాను. (అని లోపలికి పరుగెత్తుచున్నది.)

సుబ—పాపం యిది పడుచుతనంలో బాగానే వున్నదికాని దీనికి కొంచెం వెర్రి అనుకుంటాను. వెర్రికాకపోతే యేమీకారణంలేనిదే నన్నుచూచి భయపడి యిలాగు వెర్రికేకలువెయ్యదు. వీడుకూడా లోపలికి పరుగెత్తబోతూవున్నాడు. (అని పై బట్టపట్టుకొని) ఓరీ పిచ్చివాడా! యెక్కడికి పరుగెత్తిపోతావు?

రాము—బాబూబాబూ! నాబట్ట చింపివెయ్యకండి. నెల్లాళ్ళయినా కాలేదుకొత్తబట్ట కొనుక్కున్నాను.

సుబ—(బట్టవిడిచి) ఓరి మూఢుడా! నేను నీబట్ట చింపుతాననుకున్నావుట్రా?

రాము—అయ్యా? మీకుదణ్ణంపెడుతాను. దూరంగావుండండి. నాజోలికిరాకండి. మీపిచ్చిచేష్టలు నామీద చూపకండి.

సుబ—దున్నపోతా! నావిపిచ్చిచేష్టలు అంటావురా? (అని రాముని జుట్టుపట్టుకొని వంగతీయుచున్నాఁడు.)

రాము—బాబూ! చస్తిని చస్తిని. (అని కేకలు వేయుచున్నాఁడు.)

[అప్పుడు మతిమంతుఁడు ప్రవేశించుచున్నాఁడు]

మతి—మావాడికి పిచ్చ మహాయెక్కువగావున్నది. నవుకర్లనందరినీ కొడుతూ వున్నాడు. నేను యోగదృష్టితోచూచి యితణ్ని తక్షణం శాంతపరుస్తాను. (అని రెప్పవాల్చక చూచుచున్నాఁడు.)

సుబ—(మేనమామనుచూచి తొందరపడి) మామయ్యా! వీడు నావిపిచ్చిచేష్టలంటే కోపంవచ్చి కొంచెం జుట్టుపట్టుకున్నాను. అంతే కాని మరేమీలేదు.

మతి—(సుబలుని స్థిరదృష్టితో చూచుచు సమీపమునకు వెళ్ళి చేయిపట్టుకొని) నాడిబహువడిగా కొట్టుకొంటూవున్నది. ఇటువంటి వాళ్ళకు వుండేమోస్తరే యిది.

సుబ—(తనలో) ఈయనకు మతిపోయిందా యేమిటి? రెప్పవాల్చకుండా దయ్యాలు పెట్టేవాడులాగు నావంక అలాచూస్తాడేమి!

రాము—(మతిమంతుని వెనుకకువచ్చి చెవిలో రహస్యముగా) సమయానికి మీరురాక పోయినట్టయితే యితడు యీపాటినన్నుచంపి వేసును. ఇతనిని సాధారణ మయినపిచ్చకాదు. యితణ్ని తాళ్ళోగీళ్ళో వేసికట్టిపెట్టి గదిలోవేసి వుంచవలెను. లేకపోతే మీయింటికి వచ్చేవారికి యెవరికైనా అపాయం వస్తుంది.

[అప్పుడు సుమతి ప్రవేశించుచున్నది.]

సుమ—(భయపడుచువచ్చి) నాన్నగారూ! (సుబలునిచూచి తొందరపడి) యిక్కడ మీరు వక్కరే వున్నారనుకున్నాను.

సుబ—సుమతీ! నన్నుచూచి యెవరినో పరాయివాణ్ని చూచినట్టు అలాతొందర పడుతావేమి? నేను నీబావను సుబలుణ్ని. నన్నప్పుడే మరచిపోయినావా? (అని సుమతి చేయిపట్టుకొనుచున్నాఁడు.)

రాము—అదుగో వకదాన్ని వదిలి రెండో ఆడదానిమీద పడబోతూవున్నాడు.

సుమ—నన్ను ముట్టుకోకు. పడుచువాళ్లు యెదిగిన ఆడదాన్ని ముట్టుకోరాదు. (తనలో) ఇతనిమోస్తరు చూస్తే నాకంతటిపిచ్చివాడుగా కనపడడంలేదు.

సుబ—దగ్గిరబంధువులలో అటువంటి అభ్యంతరాలు వుండకూడదు. చిన్నతనంలో మనం యిద్దరమూ ప్రాణస్నేహితులముగా వుండేవాళ్ళముకామా?

సుమ—నాచెయ్యివదులు. చిన్నతనంలో చేసినట్టు యిప్పుడు చెయ్యరాదు. (అని చేయివదల్చుకొని వెళ్ళి బల్లమీద కూరుచున్నది.)

మతి—(రెప్పవాల్చక సుబలుని యోగదృష్టితో చూచుచు (తనలో) ఇతడు లొంగిపోయినాడు. కాస్తసేపు దృష్టిపట్టి చూచేటప్పటికి పరమసాధువైనాడు. ఆహా! యేమియోగబలము? (బిగ్గరగా) అబ్బాయీ! నీకు ఆకలిగా వున్నట్టున్నది. నీవు కొంచెం సేపు నీమరదలితో మాట్లాడుతూకూర్చో. నేను లోపలికివెళ్ళి నీకు కావలసినవి జాగ్రత పెట్టించి యిప్పుడేవస్తాను. (అని సుమతియొద్దకు వెళ్ళి) అమ్మాయీ! నీవు కొంచెంసేపు యితనితో మంచిమాటలుచెప్పుతూ కూర్చో అతనుయేమన్నా అవునని అన్నిటికీ తలవూపుతూ వుండు. అతనికి వ్యతిరేకంగా యేమీచెప్పకు. వాళ్ళు చెప్పిందికాదంటే పిచ్చవాళ్ళకు పిచ్చ యెక్కువై కోపంవస్తుంది సుమా! (అని వెళ్ళుచున్నాడు.)

రాము—ఆయనలేనప్పుడు నేను మంత్రిస్తాను. (అని సుబలుని కేసి రెప్పవాల్చక చూచుచున్నాడు.)

సుబ—(చేతితో రాముని జూపుచు) సుమతీ! వీడికి కొంచెం మతిభ్రమవున్న దనుకుంటాను.

సుమ—వున్నది. తప్పకుండావున్నది. (తనలో) ఇతడన్నమాట కర్థంయేమిటో.

సుబ—వీణ్ని పిచ్చవాళ్ళ వైద్యశాలలోనుంచి తీసుకుని వచ్చి నట్టున్నారు.

సుమ—మీమామయ్య కోనసీమ వెళ్ళినప్పుడు అమలాపురా న్నుంచి తీసుకునివచ్చినారు. (ఇంతలో జ్ఞప్తికితెచ్చుకొని) కాదుకాదు. పిచ్చవాళ్ళ వైద్యశాలలో నుంచే తీసుకునివచ్చినారు.

సుబ—(నవ్వుచు) సుమతీ! నీవలాగు తడబడుతూ మాట్లాడు తావేమి? నాదగ్గిర నీకుభయయంయెందుకు? నీ కావుంగరం మామయ్య గారు కొత్తగా చేయించినారా? నీచేతిని వుండడంవల్ల ఆవుంగరానికి యెంతో అందంవచ్చింది. (అని చేయిపట్టుకొను చున్నాఁడు.)

సుమ—(చటుక్కున చేయితీసికొని తనలో) మాట్లాడడాన్ని పట్టిచూస్తే యితడు మంచివాడులాగే కనపడుతూ వున్నాడుకాని పిచ్చ వాడులాగు కనపడడంలేదు. (బిగ్గరగా) మీరువూరికేనన్ను స్తుతి చేస్తూవున్నారు.

సుబ—సుమతీ! సిగ్గువిడిచి దగ్గిరగా వచ్చికూర్చో. యెవరో కొత్తవాడిలాగునన్ను మీరూమీరూ అంటూవుండకు. మనలో మనకు మర్యాదలు యేమిటి? మునుపుపిలిచేటట్టుగానే నీవు అనిపిలుస్తూవుండు. మనం చెట్టాపట్టాలు వేసుకుని యీతోటలో తిరుగుతూ పళ్ళుకోసు కుని ఆడుకుంటూవుండేవాళ్ళం. ఆ సంగతంతా అప్పుడే మరిచి పోయి నావా?

సుమ—మరిచిపోలేదు. మనంవకరోజు శాస్త్రుర్లగారి తోటలోకి వెళ్ళి నారింపండు కోసినప్పుడు జరిగినతమాషా నీకు యిప్పుడు జ్ఞాప కం వున్నదా?

సుబ—బాగాజ్ఞాపకంవున్నది. అతను మనల్ని తరుముకువచ్చే టప్పటికి మనంలేళ్ళలాగు పరుగెత్తుకువచ్చి వీధిలో పడ్డాము. అతడు మననుపట్టుకోవలెనని వెనుక పరుగెత్తుకొనివచ్చి పరుగెత్తలేక కాలు జారి బొండులాగు బురదకాలువలోపడ్డాడు. బట్టలన్నీ బురదయి పోయినవి. ఆ సంగతి చెప్పుకుని మనం నెల్లాళ్ళదాకా రోజూ కడుపు లుబ్బే టట్టుగా నవ్వుకుంటూవుండేవాళ్ళము. ఆచిన్ననాటి ఖులాసాదినాలు మళ్ళీరావు.

సుమ—అటువంటి దినాలు మళ్ళీరావు. అప్పుడు నీవు పిచ్చ—(జ్ఞప్తికితెచ్చుకొని) కాదుకాదు. నాఅభిప్రాయం అదికాదు. యేమీ లేదు. (అని తొందరపడుచున్నది.)

సుబ—సుమతీ! అలా భయపడుతావేమి? తొందరపడబోకు. నాదగ్గిర నీకు భయంయెందుకు?

సుమ—(లేచి మెల్లగా లోపలికి నడుచుచు) మానాన్నగారు—

సుబ—మీనాన్నగారు యేమిటి? ఆయనచూస్తే యేమి చేస్తాడు? తలకొట్టివేస్తాడా యేమిటి? వచ్చికూర్చో. (అని చేయి గట్టిగా పట్టుకొని లాగుచున్నాఁడు.)

సుమ—(తనలో) ఇతనికి పిచ్చ యెక్కువవుతూవున్నది. (బిగ్గరగా) అవును. మీరుచెప్పిందంతా నిజం. ఆయన మనను యేమీ చెయ్యలేడు. వచ్చి కూర్చుంటాను. నాచెయ్యి వదలండి.

సుబ—ఇదిగో వదలినాను.

సుమ—మీకు వంటయిందేమో కనుక్కొనివస్తాను. (అని చటుక్కున లోపలికిపోయి తలుపువేసికొనుచున్నది.)

సుబ—ఇదియేమిటి? (అని అద్భుతపడి నిలుచున్నాఁడు.)

[రెండుగిన్నెలును, ఒకగరిటెయు పట్టుకొని రాముఁడు
ప్రవేశించుచున్నాఁడు.]

రాము—ఇదుగో మీకు ఔషధం-కాదు భోజనం తీసుకుని వచ్చినాను.

సుబ—ఆగరిటెలోది యేమిటి?

రాము—బుడంవరుగు. నేతిలోవేయించినాము.

సుబ—ఆగిన్నెలలోనో?

రాము—వకగిన్నెలోది మిరియాలచారూ. రెండోగిన్నెలోది పెసరట్టూను. పొట్టుతియ్యకుండా ముడిపెసలు నూరి రొట్టెలు చేసినాము.

సుబ—యేడిసినట్టేవున్నది యీభోజనం. ఈపాడురొట్టెలు యెవరికికావలెను?

రాము—కోపపడకండి. మీరు రెండురొట్టెలు ఫలహారంచేస్తే కడుపులోకొంచెం చల్లపడి శాంతిస్తుంది. భోజనం చెయ్యండి.

సుబ—(లేచి రాముని జుట్టుపట్టుకొని గట్టిగా ఊపి) నన్ను యీప్రకారంగా అడవిమృగంలాగు చూడడానికి యింట్లోవాళ్ళందరూ కలిసి యేదో కుట్రచేసినారోలేదో నిజంచెప్పు.

రాము—(జుట్టువదల్చుకొనుచు) నాజుట్టువదలండి. మృగంలాగు చూడడానికి కుట్రచెయ్యడంయేమిటి? మీరు నిజంగా ఆలాగే కనబడుతూవున్నారు. మీరు పెద్ద భల్లూకపుపట్టు పట్టినారు. అడవిమృగమైనా యింతపట్టుపట్టదు. మీరు నాజుట్టువదలకపోతే ఠాణాకు పోయి బంట్రోతును తీసుకునివస్తాను.

సుబ—నీఅవకతవకప్రసంగం మానకపోయినట్టయితే యిప్పుడు నాలుగుతన్ని నిన్ను యింట్లోనుంచి అవతలికిసాగనంపుతాను. (తనలో)

బాగా ఆలోచిస్తే వీడితో విరోధంపడడం బాగాకనపడడంలేదు. ఇక వీడితో మంచిమాటలాడుతాను. వీడివల్లయేదైనావుపయోగంవుంటుంది (బిగ్గరగా) రామూ! నేనుపూటకే వేళాకోళానికి జుట్టుపట్టుకుని వూపినాను. అంతేకాని మరేమీలేదు. నీవు మహామంచివాడవుగా కనబడుతూ వున్నావు. ఇదిగో రూపాయియిస్తూవున్నాను పుచ్చుకో. (అని రూపాయిచేతిలోఁ బెట్టుచున్నాఁడు.

రాము—(పుచ్చుకొని సంతోషములో) మీరు మహాదొడ్డ వారు. మాయజమానులవంటివారు పదిమందైనా మీతో సమానం కారు.

సుబ—నాకు ఆకలిగావున్నది. తెచ్చినవి విస్తట్లోవడ్డించు.

రాము—(చిత్తము. అని రొట్టెలు విస్తరిలోవేసి నిలుచున్నాఁడు.)

సుబ—(విస్తరిముందు కూర్చుని) ఇవేమిటియీరొట్టెలు నల్లగా వున్నవి! వీటికంటె మరియేమయినా చేసినట్టయితే బాగావుండును. (అని తినుచున్నాఁడు.)

రాము—చెయ్యికరచుకుంటారు. జాగ్రతగాతినండి.

సుబ—చెయ్యి కరుచుకోవడానికి నేను పసిపిల్లవాణ్ని అనుకున్నావాయేమిటి? రామూ! యివి బాగున్నవికావు. తినడానికి వీటికంటె యేమయినా మంచివితెస్తూ.

రాము—మరేమీ తేవడానికి వల్లకాదు. అయ్యగారు యివి మాత్రమే మీకు పెట్టమన్నారు. యివన్నీ పైత్యహారపు వస్తువులట.

సుబ—అయ్యగారిని—(ఆపుకొని) పైత్యహారమూలేదు. యేమీ లేదు. మరియేమయినా తీసుకొనివస్తూ. నాకు వీటితో ఆకలి యెంత మాత్రమూ తీరలేదు.

రాము—అలాగా? (అని గరిటెయు గిన్నెలును తీసికొని పరుగెత్తుచున్నాఁడు.)

సుబ—వీడు నేను గరిటెలూ గిన్నెలూ యెత్తుకునిపారిపోతానను కున్నాడు. కాబోలును. అవన్నీ వీడు యెంతతొందరగా తీసుకుని పోయినాడో? ఇక్కడి.మాస్తరుచూస్తే నాకంతా విచిత్రంగాకనపడుతూ వున్నది. దాసీది పిచ్చదిగావున్నది. ఈరాముడు తెలివిమాలిన మోట పశువులాగు కనపడుతూవున్నాడు. నామరదలుకూడా నన్నుచూస్తే పెద్దపులినో ఫెలుగుబంటునో చూచినట్టు భయపడుతూవున్నది. ఇఖ నామామగారిసంగతి చెప్పనక్కరలేదు. ఆయనకు పాడుపొస్తకాలు చదవగా చదవగా మతిపోయింది. మహారాణిగారిని చూచినట్టు ఆయననాకేసి వూరికే రెప్పవాల్చకుండా చూడడం మొదలుపెట్టినాడు. ఆయనకు పిచ్చఅయినందుకు ఆవగింజంతయినా సందేహంలేదు. కాని సుమతిసంగతిమాత్రం నాకేమీ బోధపడడంలేదు. యిప్పుడు సుమతికి వకవుత్తరంవ్రాసి రాముడిచేత పంపిస్తాను. (అని వ్రాయుచు చదువు చున్నాఁడు—"అత్యంతప్రియురాలవైన సుమతీ! నన్నుచూస్తే నీకంత సిగ్గూ భయమూ రావడానికి కారణంయేమిటి? నీకు నామీద కోపం రావడానికి నేను యేమినేరంచేసినాను? నేనుచేసిన అపరాధం చెప్పినట్టయితే నేను వెంటనే నీకాళ్ళమీదపడి క్షమాపణ కోరుకుంటాను. కాబట్టి నాయందుదయవుంచి విచారగ్రస్తుడనైవున్న నన్ను సంతోషపెట్టవలెనని మరీమరీ వేడుకుంటూవున్నాను. నీచిన్ననాటి ప్రియ మిత్రుడు సుబలుడు"—ఇది చాలును.

[పోకదొన్నెయు విస్తరియు చేతబట్టుకొని రాముఁడు ప్రవేశించుచున్నాఁడు.]

రాము—ఇవిగో మీకు పెసరట్టు మళ్ళీతెచ్చినాను. ఈసారి ఆకలితీరేటట్టుగా కావలసినన్ని తినండి. (తనలో) ఇప్పుడు గరిటెతీసివేసి

దొన్నెలు తెచ్చినాను గనుక వీటితో యితడు యెవరికీ హానిచెయ్య లేడు. (అని క్రింద పెట్టుచున్నాఁడు.)

సుబ—(విస్తరిముందు కూరుచుండి) ఈమాటయినా మంచి రొట్టెలు తెచ్చినావా? వెండిగిన్నె లోపలపడవేసి యీవెధవదొప్ప తెచ్చినావేమి? లోపలకివెళ్ళి గిన్నెతీసుకునిరా. (అని పోకదొప్ప విసరి వేయుచున్నాఁడు.)

రాము—గిన్నెతీసుకునిరాను. మిమ్మలినినమ్మి మీచేతికి గిన్నె యివ్వడం క్షేమంకాదు. (తనలో) ఈయనచేతికి గిన్నెలూ గరిటెలూ యిచ్చి వాటితో నాతలబద్దలు కొట్టించుకుంటానా? నాకు అపాయం రాకుండా యెలా కాపాడుకోవలెనో నాకు బాగా తెలుసును. నేను మోసపోను.

సుబ—(కోపముతో) జాగ్రత. నన్నునీవు దొంగవాణ్నిగా భావిస్తూవున్నట్టున్నావు.

రాము—ఆసంగతి నాకేమీ తెలియదు. మీకది ముదిరితే అపాయం సంభవిస్తుంది. గనుక మీదగ్గిర గిన్నెలు మొదలయిన గట్టి వస్తువులు యేమీ వుంచవద్దని మీమామగారు సెలవిచ్చినారు.

సుబ—(కోపముతో) ఏదిముదిరితే—

రాము—మీకున్నజబ్బు.

సుబ—జబ్బేమిటి?

రాము—అయ్యగారు దానికేమిటో పేరుపెట్టినారు. జ్ఞాపకము చేసుకుని చెపుతానువుండండి. 'చిచ్చాల్యం' జ్ఞాపకం వచ్చింది. అవును అదే.

సుబ—నీమొఖం చిచ్చాల్యం యేమిటి?

రాము—దానికి యింకోపేరు "త్రిభ్రమ"

సుబ—మతిభ్రమ అనా నీతాత్పర్యం?

రాము—అవును. ఆమాట అదే.

సుబ—మొదటిమాట చిత్తచాంచల్యం కాబోలును.

రాము—నానోరు తిరగదు. మీ మామగారు నాతో చెప్పింది యిప్పుడు మీరన్న మాటే.

సుబ—(నవ్వుచు) ఇప్పుడు నాకంతా బోధపడ్డది.

రాము—అవును మీకూ బోధపడ్డది. (అనినవ్వుచున్నాడు)

సుబ—(నవ్వుచు) ఈవింత బహుబాగావున్నది. ఆపిచ్చి ముసలాయన నాకు పిచ్చని యెందుకనుకున్నాడు?

రాము—ఏమో! నాకు తెలియదు.

సుబ—నీకు తెలియకపోతే పోయిందిగాని నీవు నాకు వక్క సహాయం చేసిపెడుతావా?

రాము—ఏమిసహాయం? మీచేతులూకాళ్ళూ కట్టిపెట్టవలెనా యేమిటి?

సుబ—అలాగంటి పనికాదు. నాకు మామామగారి విషయంలో వక్కతమాషా చెయ్యవలెనని వున్నది.

రాము—అయ్యో! పాపం ఆయనను—

సుబ—తొందరపడకు. మరేమీలేదు. వూరికే పరియాచకం అందులో నీవు సహాయంచేస్తే నీకు వకరూపాయి యిస్తాను.

రాము—అలాగైతే ఆలోచిస్తాను. ఆయన విషయంలోచేసేది యీపుస్తకాలు తగలపెట్టడంతప్ప మరేమీనాకు కనపడదు. ఈపుస్తకాలన్నిటినీ అగ్నిహోత్రుడికి సమర్పణచేస్తే నాకెంతో సంతోషంగా వుంటుంది. అలాచేస్తురూ నాశ్రమనివారణ అవుతుంది. వీటిపురుగులు దులపలేక చచ్చిపోతూవున్నాను—ఓ అగ్ని దేవుడా! నీకు నమస్కారం

చేస్తాను. ఈయన పాతతాటాకుల పుస్తకాలన్నీ పూర్ణాహుతిగా సమర్పిస్తారు గనుక, మీరువక్క పుస్తకమయినా మిగలకుండా కంఠపూర్తిగా భక్షించి నన్ను కృతార్థుణ్ని చెయ్యండి.

సుబ—చెయ్యవలసినపని మనం యిద్దరమూ కొంచెంసేపటిలో నిశ్చయింతాము గాని నీవు ముందుగా యీవుత్తరం తీసుకుని వెళ్ళి సుమతికియిచ్చిరా. యిదుగో రూపాయి (అనియిచ్చుచున్నాడు.)

రాము—(పుచ్చుకొని) రూపాయపుచ్చుకోవడానికి నాకేమీ అభ్యంతరం లేదు గాని వుత్తరంమాత్రం నేనుతీసుకుని వెళ్ళను. వుత్తరం ఆ ఆడదానిచేత పంపించండి.

సుబ—గౌరిచేతనా? అదినన్ను చూస్తే పరుగెత్తుతుంది. నా దగ్గరకేరాదు.

రాము—దానిచేతులో రెండణాలడబ్బులు పారవెయ్యండి. అప్పుడది కావలసినంత దగ్గరగా వస్తుంది. దానికి కావలసిందంతే.

సుబ—అలాగయితే దాన్ని వక్కసారి యిక్కడికి పంపించు.

రాము—నిముషంలో పంపుతాను. (అనివెళ్ళుచున్నాడు.)

సుబ—ఒంటరిగా నేను ఆలోచించింది. బహుబాగావున్నది. వీరందరూ కలిసి వస్తే కాస్తసేపటిలో తమాషాచేస్తాను. రాముణ్ని బెదరకొట్టకూడదు. వీడుయిందులో చాలా పనికివస్తాడు. అదుగో అప్పుడే గౌరివస్తూవున్నది.

[బెదరి బెదరిచూచుచు గౌరి ప్రవేశించుచున్నది]

గౌరి—అయ్యో! రాముడు మీరు యెందుకో నన్ను రమ్మన్నారని చెప్పినాడు.

సుబ—అవును. యీవుత్తరం సుమతికి తీసుకుని వెళ్ళడం నిమిత్తం పిలువమన్నాను. అటువంటి సౌందర్యవంతురాలికి వుత్తరం తీసుకుని వెళ్ళడానికి నీవంటి అంకగత్తెలు తప్ప యితరులు తగరు.

గౌరి—(తనలో) ఇతణ్ని పిచ్చవాడంటారేమి? ఈయన మహా రాజులాగు మాట్లాడుతూవున్నారు.

సుబ—(ఉత్తరము చేతికిచ్చి) యీవుత్తరం తీసుకునివెళ్ళి నీయజమానురాలికియ్యి. యిదుగో నీబహుమానము. (అని నాలుగు అణా లిచ్చుచున్నాఁడు.)

గౌరి—(సంతోషముతో) వుత్తరం యిచ్చివస్తాను. వుత్తరం తీసుకుని వెళ్ళినప్పుడల్లా యిలా బహుమానం యిస్తూవుండవలెను.

సుబ—నీవు బహుమంచిదానవు. అలాగే యిస్తూవుంటాను. వేగిరంవెళ్ళు (అని వీపుమీాద తట్టుచున్నాఁడు.)

[అప్పుడు మతిమంతుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

మతి—(తనలో) అడుగో సుబలుడు దాన్ని కొడుతూవున్నాడు నేను మళ్ళీ యోగదృష్టితో చూచి శాంతపరచవలెను.

గౌరి—(చూచి పరుగెత్తుచు) అదుగో! అయ్యగారు వస్తూ వున్నారు. (అని వెళ్ళుచున్నది.)

సుబ—ఆవెఱ్ఱివాడా? (అని మరియొకదారిని వెళ్ళుచున్నాఁడు.)

మతి—అయ్యో! కుఱ్ఱవాడు తప్పించుకొని పోయినాడు. పిచ్చ యింతవేగంగా హెచ్చిపోవడం నేను యెక్కడా చూడలేదు.

[రాముఁడు ప్రవేశించుచున్నాఁడు]

రాము—అయ్యా! మీాకోసం యెవరో యిద్దరు పెద్దకుంకం బొట్లు పెట్టుకునివచ్చి వాకిట్లోనిలుచుని వున్నారు. వారినిచూడడంతోటే దెయ్యాలపోతులేమోనని నాకు భయంవేసింది.

మతి—వారువైద్యులయి వుంటారు. సందేహంలేదు. వారిని లోపలికి తీసుకునిరా.

గాము—అరుగో వారేవస్తూవున్నారు.

[సదానందయోగియు, గజాననదాసును ప్రవేశించుచున్నారు]

మతి—(సుబలుని కొఱకు నాలుగుదిక్కులనుజూచి) మావాడు యిప్పుడు యెలాగో వెళ్ళినాడు. సందేహంలేదు. అతను మళ్ళీ యిప్పుడే వస్తాడు. రావడంతోటే అతణ్ని మీకు చూపిస్తాను. మీరు బహు జాగ్రతగా వుండవలెను. పయికిచూడడానికి అతనంత పిచ్చవాడుగా కనపడడుగాని యీవ్యాధి మీవంటి ఘనవైద్యులు చక్కగా శోధించ తగ్గదని తలుస్తాను.

సదా—మీరు చెప్పినదాన్ని పట్టిచూస్తే మీవాడికి పైత్య చలనమని నిశ్చయిస్తాను.

గజా—క్షమించవలెను. అది పైత్యచలనంకాదు. భూతావేశ మని నేను భావిస్తాను.

సదా—మీరు మహాబాగా కనిపెట్టినారు. (తనలో) ఇతనికి యేమీ తెలియదు.

గజా—(తనలో) యేమీ తెలియకపోయినా యితడన్నీ తనకే తెలుసునంటాడు.

మతి—మీరతణ్ని సావకాశంగా పరీక్షచేసి చూడవచ్చును. మీరు వైద్యులనిచెప్పక నాస్నేహితులని మాత్రముచెపితే అతను మీతో మనసిచ్చి మాట్లాడుతాడు. అలాచేస్తే బాగావుండదా?

సదా—దివ్యంగా వుంటుంది.

గజా—బాగానేవుంటుది.

మతి—అతని విషయంలో మీరు బహుజాగ్రతగా వుండ వలెను. వొకొక్కప్పుడు అతనికి పిచ్చకోపంవస్తుంది. అలాగం

టప్పుడు అతను వళ్ళూపై తెలియకుండా దౌర్జన్యంచేస్తాడు. యిందాకా మానవుకరునూ దాసీదాన్నీ కొట్టినాడు. అయితే నేను వెంటనేవచ్చి యోగదృష్టితో చూచేటప్పటికి ఆవుద్రేకమంతాపోయి నిముషంలో శాంతపడిపోయినాడు. మీకేమైనా తొందరకలిగితే నన్ను వెంటనే పిలవండి. నేను వచ్చి యోగదృష్టితో చూచి తక్షణం శాంతుణ్ని చేస్తాను.

సదా—ఈవిషయంలో నాకు మీసహాయం అక్కరలేదు. అది మేము నిత్యమూచేసేపనే. అడుగో! ఆవచ్చేది అతనేకాబోలును.

[సుబలుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

మతి—(రహస్యముగా) అవును. అతనే (సుబలునితో బిగ్గరగా) అబ్బాయీ! వీరిద్దరూ నాస్నేహితులు. బహుతెలిసినవారు. గొప్ప విద్వాంసులు.

సదా—(మతిమంతునితో రహస్యముగా) ఆముఖలక్షణం చూడగానే నాకు పైత్యచలనమయినట్టు నిశ్చయంగా తోడకట్టుతూ వున్నది.

గజా—(మతిమంతునితో రహస్యముగా) అతని చూపువల్ల యిది గ్రహ లక్షణమయినట్టు నాకు స్పష్టపడిపోయింది.

మతి—(ఇద్దరితోను రహస్యముగా) మీరిద్దరూ ఆలోచించుకొని యేదోనిశ్చయం చెయ్యవలెను. యిఖమిమ్మలిని యిద్దరినీ యితనివద్ద విడిచి నేను వెళుతాను. (సుబలునితో బిగ్గరగా) అబ్బాయీ! నేను వక్కసారి లోపలికివెళ్ళి వస్తాను. ఈలోపుగా నీవు వీరియిద్దరితోనూ మాట్లాడుతూవుండు. వీరు బహుమంచివారు. (అని వెళ్ళుచున్నాఁడు.)

సుబ—(తనలో) ఈముసలివాళ్ళు యిద్దరూ నాకేసిచూచియేమో ఆలోచిస్తూవున్నారు. వీరుకూడా మామామగారి యోగపు పిచ్చిలో